J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 31 05.01.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## టీడీపీ + పవన్ + షర్మిల...

# టార్గెట్ జగన్!





### కాంగ్రెస్ గూటికి షర్మిల

### మెలికలు తిరుగుతున్న ఏపీ రాజకీయాలు

### జగన్ చేజారిపోతున్న 'రాజకీయం'

### వైసీపీలో పెరుగుతున్న ధిక్కార స్వరాలు!

*ఎన్నికల నామ సంవత్సరం - 2024 రానే వచ్చింది. తీపి, కారం, చేదు, పులుపు, వగరు వంటి రుచులను మనకి తెలుగు కొత్త సంవత్సరం ఉగాది సందర్భంగా ఉగాది పచ్చడి అందిస్తే, గెలుపు, ఓటమి, సంతోషం, దుఃఖం వంటి అనుభూతులను 2024లో జరగబోయే ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు ఈ కొత్త ఏడాది మిగల్చబోతోంది. జనవరి 4వతేదీ గురువారం వై.ఎస్.షర్మిల కాంగ్రెస్‌పార్టీలో చేరారు. తన తండ్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి చివరిశ్వాస వరకు కొనసాగిన కాంగ్రెస్‌పార్టీని వేదికగా ఆమె తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఎంచుకున్నారు. వై.ఎస్. కుమారుడు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డ్‌ని జైలు పాలు చేసింది కూడా ఇదే కాంగ్రెస్‌పార్టీ అన్నది ఇక్కడ గమనార్హం.*

మరికొన్ని నెలలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అయిదేళ్ల కాలం ముగియబోతున్న తరుణంలో ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలు సుడులు సుడులుగా మెలికలు తిరుగుతున్నాయి. రాజకీయం వేడెక్కుతోంది. అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. జగన్ కోసం 2019 ఎన్నికలకు ముందూ, ఆ తరువాతా వైసీపీకి పనిచేసిన "ఎన్నికల వ్యూహకర్త" ప్రశాంత్ కిషోర్ ఇటీవల హఠాత్తుగా విజయవాడలో చంద్రబాబును కలవడం రాజకీయవర్గాలలో పెనుసంచలనమయ్యింది.

ఈ భేటీ జరిగిన తరుణంలోనే జగన్ సోదరి వై.ఎస్. షర్మిల లోకేష్‌కు క్రిస్టమస్ శుభాకాంక్షలు పంపి, మరో

10లో



## వైసిపిలో భారీగా బదిలీలు

### > కసరత్తు చేస్తున్న అధిష్టానం




ఎక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వంలో పనిచేయాల్సింది మాత్రం అధికారులే. అందుకోసమే ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు మారిన వెంటనే తమకి అనుకూలమైన అధికారులను కీలక స్థానాల్లో నియమించుకోవడానికే ఏ ప్రభుత్వాధినేతైనా ఆసక్తి చూపిస్తారు. తాము ఆశించిన స్థాయిలో ఏ అధికారైనా తన విధులు నిర్వహించలేకపోయినా, స్థానిక నాయకులు ప్రజల నుండి అసంతృప్తి వ్యక్తమయినా.. సదరు అధికారిని ప్రభుత్వం మరో స్థానానికి బదిలీ చేస్తుంది. ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఒక్క ప్రభుత్వాలే కాదు కార్పొరేట్ స్థాయిలో పనిచేసే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐటీ కంపెనీలూ కూడా అవలంభించే విధానం ఇదే. తమ ఉద్యోగుల పనితీరు బాగాలేకపోతే వారిని మరోచోటుకి బదిలీచేస్తారు. అక్కడా వాళ్ళు అసమర్ధులని

3 లో



# పోలేరమ్మ జాతరకు..పోటెత్తిన జనం

**• జనసంద్రంగా మారిన అల్లూరు • ముగ్గురమ్మలకు వైభవంగా పూజలు**





కరుణించి కాపాడే అమ్మ..అల్లూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి, గ్రామదేవతలు గంగమ్మ, కలుగోళమ్మ అమ్మవార్లకు జనవరి 2న అల్లూరులో పెద్దఎత్తున పూజలు, తిరునాళ్ళ వేడుకలు జరిగాయి. వేలసంఖ్యలో భక్తజనం తరలి రావడంతో ఊరంతా జనసంద్రమైంది. అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించి గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పోలేరమ్మ అమ్మవారు బంగారు చీరలో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్నంతా నిర్వాహకులు విద్యుద్దీపాలతో, పూలమాలల అలంకరణలతో శోభాయమానం చేశారు. మంగళవాద్యాలు, తప్పెట్లు తాళాలు, భక్తినృత్యాలతో ఊరంతా కోలాహలంగా మారింది. అల్లూరు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివ ప్రియమ్మ సంప్రదాయబద్ధంగా ముగ్గురమ్మలకు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులందరి సహకారంతో విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో కన్నుల పండువగా జరిగిన ఈ జాతర వేడుకల్లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి..టీటీడీ ఉత్తరభారతదేశ ఆలయాల సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పాల్గొని పోలేరమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత, మహిళలు పెద్దసంఖ్యలో అల్లూరు శివార్లలో ఉన్న పెట్రోలు బంకు వద్ద నుంచి తూర్పువీధి మహాలక్ష్మమ్మ గుడివద్దకు ఊరేగింపుగా వచ్చి విష్ణువర్ధన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి భారీసంఖ్యలో భక్తజనం అమ్మవారికి నైవేద్యంగా సద్దికుండలతో ఆలయం వద్దకు వచ్చి ప్రదక్షిణలు చేసి పోలేరమ్మ వేపచెట్టు వద్ద నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గంగమ్మ, కలుగోళమ్మ ఆలయాల వద్ద కూడా పెద్దఎత్తున పూజలు చేశారు. తీన్మార్ బ్యాండ్లు, కేరళ వాద్యాలు, కోలటాలు, కులుకు భజనలు, తప్పెట్ల మోతలతో అమ్మవార్ల జాతర అంగరంగ వైభవంగా జరిగింది.




# కవులు, కళాకారులను ప్రోత్సహించాలి

**- రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు**

కవులు, కళాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) అన్నారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్‌లో శ్రీ సుమధుర నాట్యమండలి-కోవూరు వారి ఆధ్వర్యంలో ఆంధ్ర-తెలంగాణ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనం జరిగింది. కోవూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, చిత్రకారుడు షేక్ ఖుద్దూస్‌బాషా 50 సంవత్సరాల కళాసేవను కొనియాడుతూ పలు సంస్థల వారు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూపొందించిన ఖుద్దూస్‌బాషా అభినందన సంచిక సావనీర్‌ను బీఎంఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కళాకారులు తమ నటనకు కేవలం చప్పట్లతోనే సంతృప్తి పడతారని, నాటకాల్లో గొప్ప పాత్రలు పోషించినా అనేకమంది కష్టాలతోనే జీవితం గడుపుతుంటారని అంటూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కవులను, కళాకారులను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం కళాసేవకే జీవితాన్ని అంకితం చేసి, రాష్ట్రవ్యాప్తంగా వందలాది నాటకాలను ప్రదర్శించిన 'అభినవ హరిశ్చంద్ర' ఖుద్దూస్‌బాషా కళాసేవ అద్భుతమని ఆయన ప్రస్తుతించారు. అనంతరం, 'సేవారత్న' షేక్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో విజయనగరం కళాకారులు ఖుద్దూస్ బాషాకు స్వర్ణకంకణం బహూకరించారు. నెల్లూరు జిల్లా పరిషత్ సిఇఓ బి.చిరంజీవి, ఆర్డీఓ ఏ.మలోల, తెలంగాణకు చెందిన వేములవాడ నృత్యకళానికేతన్ సేవాసంస్థ (రాజన్న సిరిసిల్ల జిల్లా) వ్యవస్థాపక అధ్యక్షులు యెల్లపోశెట్టి, వారాల దేవయ్య, నాదమునుల రామారావు, సావనపల్లి శ్రీనివాస్, కనుపర్తి హనుమాండ్లు, రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు షేక్ సలీమ్, ఖాదర్‌బాషా, నెల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటి రేబాల శ్రీలక్ష్మి, విజయనగరం కళాసంస్థల వారు దాసరి తిరుపతినాయుడు, చింతా నాగేశ్వరరావు, ఎంవిఎస్ సుధాకర్‌రావు పట్నాయక్, 'నట విద్వన్మణి' పనుమర్తి కనకమహాలక్ష్మి తదితరులతో పాటు, శ్రీనివాసరెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం, బొబ్బల శ్రీనివాసయాదవ్, హరిబాబుయాదవ్, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కవులకు సన్మానాలు

ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలు అవధాని కోట రాజశేఖర్, డా. బీమకుర్తి వెంకటేశ్వరరావు, వసం సుబ్రహ్మణ్యం, ప్రముఖ కవి-రచయిత.. 'లాయర్' వారపత్రిక సబ్-ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు తదితరులను, ఖుద్దూస్‌బాషా దంపతులను బీఎంఆర్ ఘనంగా సత్కరించారు. నల్లమల్లి సత్యనారాయణరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



## వేడుకగా రంగనాథుని రాపత్తు ఉత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా అత్యంత వైభవంగా జరిగిన రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ రంగనాథస్వామి వారికి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేసి పల్లకిలో ఊరేగించారు. అనుమాలశెట్టి నరసింహులు ఉభయకర్తగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ సేవలను తిలకించి తరించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## నేత్రదానం



నెల్లూరు, బీవీ నగర్‌కు చెందిన గిద్దలూరు విజయలక్ష్మి(70) ఇటీవల అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మరణించగా, ఆమె కుటుంబ సభ్యుల కోరిక మేరకు మృతురాలి నేత్రాలను ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ లాలేషా, డాక్టర్ షెఫాలి, డాక్టర్ యశస్విని సేకరించారు.

# టిడ్కో ఇళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**— మాజీమంత్రి పొంగూరు నారాయణ**



తెలుగుదేశం ప్రభుత్వం, నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో సుమారు 43వేల టిడ్కో ఇళ్ళను సిద్ధం చేసి వాటిని పేదలకు పంచిపెట్టాలనుకుంటున్న దశలో ఎన్నికలు రావడం, వైకాపా గెలవడంతో ఆ ఇళ్ళను నేటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఆ ఇళ్లను పేదలకు ఇవ్వకుండా గాలికొదిలేయడం దారుణమని మాజీమంత్రి, నెల్లూరు నగర నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ విమర్శించారు. ఇటీవల ఆయన టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ ఆధ్వర్యంలో నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో పలువురు ఆటో కార్మికుల కుటుంబాల వారు టీడీపీలో చేరగా, వారందరితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కూడా కార్మికుల కుటుంబం నుంచే వచ్చానని, వారి బాధలు తనకు తెలుసని అన్నారు. పేదల కోసం కట్టిన ఇళ్లను పేదలకు ఇవ్వకుండా వాటిని నాశనం చేస్తున్న వైకాపాకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, టీడీపీకి ఘనవిజయం సాధించిపెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు కరిముల్లా, మధు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 కోట్ల మద్యం..

# గుటకాయస్వాహా!

నూతన సంవత్సరం ప్రారంభంలో సంతోషం పట్టలేక మద్యం బాబులు పూటుగా తాగేశారు. మద్యం మత్తులో బాగా తాగారు... పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ డిసెంబరు 31, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మరుసటిరోజున (జనవరి1) హుషారుగా మద్యం బాబులు వేలాది మద్యం బాటిళ్ళను ఖాళీచేశారు. ఆ రెండు రోజుల్లోనే దాదాపు 10కోట్లా 71లక్షల రూపాయల విలువచేసే మద్యం విక్రయాలు జరగడం విశేషం. సాధారణ రోజుల్లో కూడా రోజుకు కనీసం 3 కోట్ల రూపాయల దాకా, ఆదివారం రోజుల్లోనైతే సెలవు కనుక తీరిగ్గా తాగుతుండడంతో మరో 4.37 కోట్ల రూపాయల దాకా మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. ఏడాది చివరి రోజు కనుక డిసెంబరు 31న ఏకంగా రూ. 6.34 కోట్ల మద్యం తాగేశారు. జనవరి 1న సంబరంగా మరో 4.37 కోట్ల రూపాయల మద్యాన్ని లాగించేశారు. దీంతో ఆ రెండు రోజులు మద్యం దుకాణాలు కళకళలాడాయి. అర్ధరాత్రి దాకా ఈ దుకాణాలకు అనుమతి ఇవ్వడం, బార్లకు రాత్రి 1 గంట దాకా అనుమతి ఉండటంతో బార్లు, దుకాణాలు మద్యంప్రియులతో క్రిక్కిరిసిపోయాయి.

# ఆకట్టుకున్న సంగీత విభావరి



అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు పురమందిరంలో ఇటీవల సంగీత విభావరి నిర్వహించారు. స్థానిక సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుబాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. తొలుత ఘంటసాల, అక్కినేని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, గాయనీగాయకులు ఘంటసాల మధురగీతాలను గానం చేశారు. కళాకారులు నృత్యాలను ప్రదర్శించారు. ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ విశ్రాంత డెప్యూటీ డైరెక్టర్ దోనిపూడి కేశవనారాయణమూర్తి, స్థానిక ప్రముఖులు డా.మారం సుధాకర్, రియాజ్‌బాషా, పద్మజారెడ్డి, సుజాతారెడ్డి, పేరూరి ప్రదీప్, మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలకు చిక్కిన..విద్యుత్ ఏఈ

విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులనుంచి లంచాలు డిమాండ్ చేస్తున్న జలదంకి మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌ను, మరో లైన్‌మెన్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఈనెల 2న ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా, మారువేషాలతో అక్కడకు వెళ్ళి దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రైతు దివి నరసింహారావు తన పొలంలో బోరుబావికి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. రూ. 20వేలు లంచం ఇవ్వకుంటే పని కాదని ఏఈ, లైన్‌మెన్‌లు తెగేసి చెప్పడంతో ఆవేదనకు గురైన రైతు లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వెంటనే ఏసీబీ డీఎస్పీ వీఆర్ఆర్ మోహన్, సీఐలు శ్రీనివాస్, విజయకుమార్, కిరణ్, ఆంజనేయరెడ్డి, సిబ్బంది స్పందించి మారువేషాలు వేసుకుని జనవరి 2న జలదంకి సబ్‌స్టేషన్‌లో ఉన్న ఏఈ చంద్రశేఖర్, లైన్‌మెన్ అశోక్‌కుమార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సాంబశివరావులను పట్టుకున్నారు. ఆ లంచావతారాలపై కేసు నమోదు చేశారు.

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



ప్రముఖ సంఘసేవకురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు జనవరి 3న జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, కుట్టి కళాశాల ప్రిన్సిపాల్ లతీఫ్ కుట్టి పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ ఆనందకుమార్‌బాబు, సిహెచ్.విజయ, డాక్టర్ ఆర్.మధుమతి, డాక్టర్ కె.సునీత, డాక్టర్ టి.విమల, డాక్టర్ పిబి.సుచరిత, డాక్టర్ హనుమారెడ్డి, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతులకు నివాళి

నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో పూలే విగ్రహాల ఆవిష్కరణకర్త ఆరంబాక్కం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జనవరి 3న వేడుకలు నిర్వహించారు. తొలుత పూలే దంపతులకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ బీసీ చైతన్యసమితి జిల్లా నాయకులు భరత్, దేవళ్ళ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి..
# రూ. 5 లక్షల విరాళం



నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు నూతలపాటి వెంకట సాయి, శ్రీకృష్ణ, రవికుమార్‌లు ఇటీవల 5 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. తమ తల్లిదండ్రులు నూతలపాటి వెంకటసుబ్బయ్యనాయుడు-లలితమ్మల జ్ఞాపకార్థం ఆ మొత్తాన్ని ఆసుపత్రి కన్వీనర్ జుబైర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఎస్పీగా..
# సిఐడీ డీఎస్పీ రాంబాబు



నిబద్ధతకు మారుపేరుగా నిలిచి, విధి నిర్వహణలో అత్యంత క్రమశిక్షణతో ఉంటూ అనేక విశిష్ట అవార్డులు, ప్రతిష్ఠాత్మక పతకాలు సైతం అందుకున్న వివిఎస్ రాంబాబు అడిషనల్‌ఎస్పీ అయ్యారు. నెల్లూరులో సిఐడి విభాగంలో పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం ఏఎస్పీ(అడిషనల్ ఎస్పీ)గా ఇటీవల ఉద్యోగోన్నతి కల్పించింది. ఆయన్ను ఇంటెలిజెన్స్ విభాగానికి కేటాయించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## చెత్తను తొలగించిన బొబ్బల



నెల్లూరులో మున్సిపాలిటీ కార్మికుల సమ్మె కారణంగా 37వ వార్డు అంతా చెత్త నిండిపోవడంతో ఆ వార్డు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ ఇటీవల ప్రైవేట్ కార్మికులతో చెత్త తీయిస్తుండగా, అలా తీయించడానికి వీలు లేదంటూ సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డగించారు. అయినా ఆయన వెనుకడుగు వేయకుండా తానే స్వయంగా రంగంలోకి దిగి చెత్తను తొలగించారు.

# వైసిపిలో భారీగా బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

తేలితే ఉద్యోగం పీకిపారేస్తారు. ఈ వ్యవహారం ప్రభుత్వ విభాగాలలో, వ్యాపారసంస్థలలో సర్వసాధారణం.

అయితే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కొత్త ఒరవడికి వైఎస్సార్ పార్టీ శ్రీకారం చుట్టింది. తాము ఎంపికైన నియోజకవర్గాల్లో గత అయిదు సంవత్సరాలుగా కర్రపెత్తనం చేసిన కొంతమంది శాసనసభ్యులను వారి నియోజకవర్గాల నుండి బదిలీ చేస్తోంది. ఇప్పటికే 33మందికి స్థానచలనం కలిగించింది. జాబితాలో మరికొంతమంది పేర్లను పార్టీ అధిష్టానం పరిశీలిస్తోందని పార్టీ వర్గాల భోగట్టా. పార్టీ నిర్వహించిన రహస్య సర్వేలో 45 నుండి 50మంది వరకూ తమ పనితీరుతో ప్రజలని మెప్పించలేకపోయారన్నది పార్టీ వద్ద ఉన్న సమాచారం. అవినీతి ఆరోపణలు, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ప్రభుత్వం అందచేస్తున్న పథకాల పట్ల తమ నియోజకవర్గ ఓటర్లను చైతన్యపరచలేకపోవడం వంటి అంశాలతోపాటు ఇంకా అనేక విషయాలలో వీళ్లంతా వెనుకబడ్డారని పార్టీ భావిస్తోంది. అయితే, గతంలో కూడా రాజకీయాలలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి. ప్రజాక్షేత్రంలో ఎవరైనా నాయకులు చెడ్డపేరు తెచ్చుకుంటే, వాళ్లకి ఆ తరువాత ఎన్నికలలో సంబంధిత పార్టీ టిక్కెట్టు ఇచ్చేది కాదు.

తాజాగా వైసీపీ అధిష్ఠానం కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. సంస్థలు, ప్రభుత్వాలు తమ ఉద్యోగుల్ని, అధికారులని బదిలీ చేసినట్లుగా ఎం.ఎల్.ఏ అభ్యర్థులని బదిలీ చేస్తోంది. ఇప్పటికే రెండు దఫాలుగా జాబితా విడుదలచేసి 33 స్థానాలకి ఇన్‌ఛార్జులను నియమించింది. ప్రస్తుతానికి ఇన్‌ఛార్జులయినా, రాబోయే ఎన్నికలలో ఆయా స్థానాలనుండి పోటీ చేయబోయేది వాళ్ళే అన్న సంకేతాలని ఇచ్చేసింది.

## కుటుంబ పాలనకి...
## వారసత్వ రాజకీయాలకి లైన్‌క్లియర్!

కుటుంబ పాలనకి, వారసత్వ రాజకీయాలకి తమ పార్టీ వ్యతిరేకమని చెప్తూనే మరోవైపు ఆ సిద్ధాంతానికి ఆ పార్టీ నీళ్ళొదిలేసింది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరులతోపాటు మరికొన్ని చోట్ల వారసులకి, ఒకే కుటుంబసభ్యులకి అవకాశం కల్పించింది.

ఉదాహరణకి చిత్తూరుజిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి అటు పార్టీలో ఇటు ప్రజాక్షేత్రంలో చురుకుగా పనిచేస్తున్నారు. జగన్ సమీప బంధువు, వై.ఎస్.రాజారెడ్డి శిష్యుడు, రాజశేఖరరెడ్డి అనుయాయుడు టీటీడీ ఛైర్మెన్ భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి. తిరుపతి నుండి పోటీ చేయడానికి అధిష్ఠానం అంగీకరించింది. మరోవైపు వై.ఎస్.జగన్ భక్తుడు, ఆంతరంగికుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డికి కూడా పార్టీ ఆమోదం తెలిపింది. అభినయ్ తిరుపతి, మోక్షిత్ చంద్రగిరి నియోజకవర్గాలనుండి వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు. నెల్లూరులో మేకపాటి కుటుంబానికి రెండు టికెట్లు ఇవ్వనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గెలుపు గుర్రాలను బరిలో దింపే క్రమంలో ఇలా కొన్ని నియమాలను, నిబంధనల్ని పక్కనపెట్టి వైసీపీ అభ్యర్థులను నియమిస్తోంది. కొన్నిచోట్ల కొత్తవారిని ఎంపికచేస్తే, మరికొన్ని చోట్ల బదిలీలతో భర్తీ చేస్తోంది!

చివరికి ఈ బది'లీలలు' ఏ పరిణామానికి దారితీస్తాయో వేచిచూడాల్సిందే మరి!

# శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవస్థానంలో తొలిసారిగా నూతన సంవత్సరం-2024 సందర్భంగా అమ్మవారి క్యాలెండర్‌ను రూపొందించి జనవరి 3న నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. నగర మేయర్ స్రవంతి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న భవన్‌లో.. కొత్తసంవత్సర వేడుకలు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని జగనన్న భవన్‌లో వైకాపా నాయకుడు దార్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈనెల 3న ఘనంగా వేడుకలు జరిగాయి. డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని న్యూఇయర్ కేకును కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు చింతల రాజేష్, గంప నరసింహారావు, నన్నేజాన్, మునీర్, చుక్కల బాబు, రామనాథం, ఖలీల్, చిట్టి, సంజీవ్, సాత్విక్, మీరా, పెనుమల్లి శ్రీనివాసులు, మల్లి రత్నయ్య, నాగా ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# బడులు బాగుపడితేనే బాలలకు భవిత

విద్యతోనే ఉద్యోగం లేదా ఉపాధి. విద్య-విజ్ఞానం లేకుంటే నేటి అధునాతన సమాజంలో బతకడం కష్టం. విద్యతోనే దేశాభ్యున్నతి సాధ్యమవుతుంది. పాతకాలంలో చదువులు అందుబాటులో లేక ఎంతోమంది ప్రజలు చదువుకోలేని పరిస్థితి. ఆడపిల్లలకు చదువులెందుకు అనేవాళ్ళు. ఇప్పుడా కాలం పోయింది. మహిళలు విద్యారంగంలో ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతున్నారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలి. బాగా ఎదగాలి. సమాజంలో చక్కగా రాణించాలన్నది అందరి ధ్యేయమైంది. చిన్నతనం నుంచే చదువు పట్ల ప్రతిఒక్కరిలో ఆసక్తి కలుగుతోంది. అందుకు తగ్గట్టుగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా విద్యాలయాలు, పాఠశాలలు అందరికీ అందుబాటులో ఉంటున్నాయి. నిరుపేదలు, బడుగు బలహీనవర్గాల వారు సైతం విద్యారంగంలో పోటాపోటీగా చదువుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే, చదువులకు ఇప్పుడు స్వర్ణయుగమే. అయితే, వచ్చిన చిక్కల్లా ఏమిటంటే, మనదేశంలో బడులు లెక్కపెట్టడానికి బోలెడన్ని ఉన్నాయి కానీ, వాటిలో బాలలకు అవసరమైన వసతులు మాత్రం ఉండడం లేదు. అనేక బడుల్లో అరాకొర సౌకర్యాలు మాత్రమే ఉంటున్నాయి. ఇతర దేశాల్లో విద్యాలయాలు అద్భుతమైన సదుపాయాలతో మెరిసిపోతుంటే మన దేశంలో మాత్రం అనేకప్రాంతాల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు అవస్తలకు నిలయాలుగా ఉంటున్నాయి. సరస్వతీనిలయాలుగా విలసిల్లాల్సిన విద్యాలయాలు కనీస వసతులు కూడా లేక అస్తుబిస్తుగానే నడుస్తున్నాయి. దేశంలో సుమారు 15 లక్షల పాఠశాలల్లో దాదాపు 27 కోట్ల మందిదాకా విద్యార్థులు చదువుకుంటున్నారని, వాటిలో కనీసం 14శాతం బడులు అసౌకర్యాలతోనే కాలం నెట్టుకొస్తున్నాయని ఇటీవల జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సమితి అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు, దేశవ్యాప్తంగా 22 శాతం పాఠశాలలు పాతబడిపోయి, పెచ్చులూడిపోయి రేపోమాపో కూలిపోయే స్థితికి చేరుకున్నాయని ఆ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. మరో దారుణం ఏమంటే, దేశంలోని దాదాపు 5 లక్షల పాఠశాలల్లో కనీస నీటి వసతి లేకపోవడం. మరోవైపు, సుమారు 12 వేల పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేని

లాయర్
జనవరి 05, 2024

దుస్థితి. అనేక పాఠశాలలకు క్రీడావసతులు అసలు ఉండవు. ఇరుకు గదులు, చెట్లకిందనో, పశువుల పాకల్లోనో పాఠశాలలు నడిపే దుర్గతి ఇంకా పోలేదు. అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెడుతుంటారు కానీ, అది నాణ్యతగా ఉండదు. ఏవో నాశిరకం కూరలు, పాసిపోయిన వంటకాలతో అన్నం పెట్టేస్తుంటారు. ఆ భోజనం తిని విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతుంటారు. దేశవ్యాప్తంగా బాలలకు పెట్టే మధ్యాహ్నభోజనంపై పర్యవేక్షణ చేసే నాథులే ఉండడం లేదు. ఒకవేళ ఏ అధికారైనా ఒకసారి ఆకస్మిక తనిఖీలు చేసినా, అవన్నీ నామమాత్రంగానే ఉంటున్నాయి. పాఠశాలలను అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్ది, బాలల మనసుకు తగ్గట్టుగా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి వారు చదువులో బాగా రాణించేలా చర్యలు తీసుకోవాలన్న ఆలోచన పాలకులకు ఉండడం లేదు. బడ్జెట్ అంటూ ఒకటుంటుంది కానీ, అందులో విద్యకు బొటాబొటీ నిధులే ఉంటాయి. సరైన మెనూ ఉండదు. ఆ భోజనాన్ని తయారుచేసేవారికి సక్రమమైన సదుపాయలు కానీ, వేతనాలు కానీ ఉండవు. ఎటుచూసినా అన్నీ అసౌకర్యాలే. దీంతో, ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన కూడా అస్తవ్యస్తంగానే ఉంటుందనే అపోహతో అనేకమంది ఇతరత్రా ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయించడం నేటికీ జరుగుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం అనేక అధునాతన వసతులతో ముందుకు దూసుకుపోతుంటే, ఇరుకు గదుల్లో సరిగా చదువు చెప్పేవారు లేక మనదేశంలో అత్యధిక శాతం మంది బాలలు ఎంతోకాలంగా చదువులో వెనకబడే ఉన్నారు. ప్రహరీలు లేని పాఠశాలలు, పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గోడలు..మరుగుదొడ్లు కూడా కట్టుకోలేని అవస్తలు!..ఇవేనా మన బడులు?..ఇంకా ఎంతకాలం ఈ దుస్థితి?..ఇకనైనా కేంద్రప్రభుత్వం విద్యారంగానికి ఉత్తుత్తి మాటల్తో కాదు, చేతల్లో పెద్దపీట వేయాలి. ప్రతి పాఠశాలలోనూ బాలలు చదువుకునేందుకు అన్ని వసతులు ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. బడులు బాగుంటేనే కదా..బాలలకు భవిత?..ఆ విషయాన్ని మనసులో పెట్టుకుని, పాఠశాలలను ఎంత ఉన్నతంగా తీర్చిదిద్దాలో ఆలోచించి ప్రణాళికలు రూపొందించి సత్వరం అమలుచేయాలి. విద్యావంతులు, మేధావులతో సమీక్షించి బడుల బాగుకు బాటలు వేయాలి. శిథిలమైన పాఠశాలల స్థానంలో వెంటనే కొత్త భవనాల నిర్మాణం జరగాలి. విశాలమైన తరగతి గదులు కట్టించాలి. నీటి వసతి, మరుగుదొడ్లు, ఆట స్థలాలు వంటి సదుపాయాలు ఉండేలా ప్రాథమిక విద్యకు బడ్జెట్‌లో భారీ కేటాయింపులు జరగాలి. తద్వారా బాలల బంగారు భవితకు ఈ కొత్త ఏడాదైనా శ్రీకారం చుట్టాలి.

# కొత్త సంవత్సరం సంబరాలు సరే.. సంకల్పాలేవీ?

కొత్త సంవత్సరం వచ్చిందని సంబరాలు బోలెడు. ఎవరికి తోచిన విధంగా వారు 'న్యూ ఇయర్'ను ఒక పండుగలా హ్యాపీగా చేసుకోవడం ఆనవాయితీగా మారింది. మంచిదే. పాత పోయి కొత్త వస్తోంది కనుక, ఎవరైనా సంతోషపడాల్సిందే. నిజానికి ఆరోజున ఎంతో మంది, బహుశా డిసెంబర్ చివరి రోజునో లేకుంటే, అంతకుముందు రోజునో ఆ సంవత్సరం వెళ్లిపోతుంది కదా..అనుకుని, 'అరె ఇంత త్వరగా కొత్త సంవత్సరం వచ్చేసిందా' అనుకుంటుండడం కూడా సహజమే. ఔను!.. రోజులు చకచకా దొర్లిపోతున్నాయి. కాలం ఎవరి కోసమూ ఆగదు. కాలచక్రం కదిలిపోతూనే ఉంటుంది. పోయిన క్షణం ఇక తిరిగి రాదు. ఇక, ఒక సంవత్సరమే పోతే!.. అందుకే, కాలం ఎంతో విలువైనదంటారు పెద్దలు. సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి. సమాజంలో ఎందరో దారితప్పిపోతుంటారు. లేనిపోని ఆర్భాటాలకు, అలవాటు పడుతుంటారు. మరికొందరు దురలవాట్లతోనే సహవాసం చేస్తూ కాలం గడిపేస్తుంటారు. ఇంకొందరు అందని ద్రాక్ష కోసం అర్రులు చాస్తూ దురాశాలకు లోనై చివరికి నిరాశలో మునుగుతుంటారు. లేనిపోని ఆలోచనలతో మనసు వికలం చేసుకుని కుంగుబాటుకు గురవుతుంటారు. జీవితం అన్న తర్వాత కష్టసుఖాలు రెండూ ఉంటాయి. చీకటి-వెలుగు సహజం. దేనికీ కుంగిపోకూడదు.. పొంగిపోకూడదు. సహనం-సంయమనంతో జీవించాలి. స్వార్థం వీడి ధర్మబద్ధంగా జీవితాలు సాగించాలి. ఎంతటివారికైనా సరే, జీవిత ప్రయాణంలో మిట్టపల్లాలు తప్పవు. ఆశలతో ఆరాటం, ఆశయాలతో పోరాటం అందరికీ ఉండేవే. నిరాశలనుంచే ఆశల పల్లకిని ఎక్కేందుకు ప్రయత్నించాలి. ఓటమి నుంచే గెలుపుకు బాటలు వేసుకోవాలి. ఎక్కడా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా మన జీవితాలను మనం పరిరక్షించుకుంటూ, అవతలివారి జీవితాలను కూడా రక్షించగలగాలి. గత ఏడాదంతా వృధా అయిపోయిందే అనుకుని దిగులు పడేకన్నా, ఈ ఏడాదిలో ఏం చేయగలమో ఆలోచించాలి. మనకున్న ప్రతిభా పాటవాలతో మనం ఏం సాధించగలమో, తద్వారా మన కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఏం మేలు చేయగలమో చూడాలి. కొందరు ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి భయపడుతుంటారు. మరికొందరు లేనిపోని సాహసాలు చేసి ప్రమాదాలు కొనితెచ్చుకుంటూ ఉంటారు. ఆవేశం అనర్థాలకు హేతువు అని గుర్తుంచుకోవాలి. ఆలోచన-వివేచనతో జీవితాల్లో రాణించాలి. జీవితం ఎక్కడా పెడదారి పట్టకుండా చూసుకోవాలి. ధైర్యంగా బతకాలి. నీతి నిజాయితీలతో రాణించాలి. చుట్టూ చీకటిగానే




ఉందని డీలా పడిపోకూడదు. ప్రయత్నించి చిరుదీపం వెలిగించుకోవాలి. ఆ వెలుగు అందరికీ వెలుగుబాట కావాలి. ఖాళీగా చేతులు ముడుచుకుని కూర్చునేకంటే ఓ మొక్కను నాటుకోవచ్చు. లేదా ఉన్న మొక్కలకు నీళ్లు పెట్టవచ్చు. లేదా మన ఇంటి గోడమీద నిత్యం వాలే పక్షుల దాహం తీర్చేందుకు ఓ పళ్లెంలో నీళ్లు ఉంచవచ్చు. గతంలో పిచుకల కోసం వరికంకులు ఇంటి ముంగిట్లో వేలాడదీసేవాళ్ళు. చీమలు తింటాయని బియ్యపు పిండితో ముగ్గులు వేసేవాళ్ళు. చూడండి ఎంత భూతదయో!.. ఇప్పుడలాంటి కరుణార్ధ్ర భావాలు రానురాను కనుమరుగైపోతున్నాయి. రోడ్డు మీద పోతున్నప్పుడు పక్కనే కుళాయిలో నీళ్లు వృధాగా పోతుంటే దాన్ని ఆపవచ్చు. దారినపోయే యాచకుల ఆకలి తీర్చడానికి మనవంతు ఏ ఒకరికైనా పిడికెడు మెతుకులు పెట్టవచ్చు. ఎక్కడైనా గోమాతలు ప్లాస్టిక్ కవర్లను తినేస్తుంటే ఆ కవర్లను తీసిపారేసి, వాటికి ఏదైనా ఆహారం పెట్టవచ్చు. చలికి ఎంతోమంది ముసలివాళ్ళు, నిరుపేదల రోడ్లపక్కన ముడుక్కుని పడుకుని ఉంటారు. చేతనైతే ఓ దుప్పటిని వారికి ఇవ్వొచ్చు. చూసేందుకు ఇవన్నీ చిన్నపనులే కావచ్చు. అందరికీ తెలిసినవే కావచ్చు. ఎంతోమంది చేస్తుండవచ్చు కూడా. కానీ ఎంతవరకు మనందరం వాటిని ఆచరించగలుగుతున్నామో ఈ కొత్త సంవత్సరారంభాన ఒకసారి ఎవరికి వారు ఆలోచించుకోవాలి. మన సేవాభావం పిల్లలకు కూడా అలవడేలా చూడాలి. సేవ చేయడంలో ఎంత సంతృప్తి ఉంటుందో, ఆకలైనవారికి పిడికెడు అన్నం పెడితే మనసుకెంత సంతోషంగా ఉంటుందో.. ఒక్కసారి ఆచరణలో చూడండి..మీకే తెలుస్తుంది. అసహాయులకు, అంధులకు, దీనులకు చేయగలిగినంత మేరకైనా మానవతాభావంతో సాయం చేయాలి. చేయాలనుకోవాలే గానీ, లెక్కలేనన్ని దారులున్నాయి. ఏదీ చేయకుండా వృధాగా కాలయాపన చేసేవారికి చెప్పడానికి బోలెడన్ని సాకులున్నాయి. ఏదేమైనా పాత ఏడాది ఎటూ జరిగిపోయింది. ఈ కొత్త సంవత్సర శుభ సందర్భంలోనైనా మంచి లక్ష్యాలను సాధించేందుకు ఎవరికి వారు గట్టి సంకల్పం చేసుకోవాలి. అదే సందర్భంలో మనకు, మన చుట్టూ మనకు రక్షగా ఉన్న సమాజానికి ఏదో ఒక మేలు చేసేందుకు ప్రతిఒక్కరూ నిర్ణయించుకోవాలి. సంబరాల కంటే మిన్నగా, సమున్నతంగా ఆ సంకల్పాలు ఉండాలి. నిరాశలు-నిరుత్సాహాలు వదిలేసి, ప్రజ్ఞాపాటవాలతో, వివేకంతో విజయాలు సాధించుకోవాలి. ఈ కొత్త ఏడాది అందరూ వారు కోరుకున్న రంగాల్లో అనుకున్న లక్ష్యాలు సాధించి విజయాల బాటలో ముందుకు సాగిపోవాలని మనసారా కోరుకుంటూ....

- రాజశ్రీ

# పార్కింగ్ స్థలాలు లేక ఇక్కట్లు

నెల్లూరు నగరంలో రోడ్లు రానురాను మరింత ఇరుకుగా తయారయ్యాయి. ఆక్రమణల జోరు పెరిగిపోవడం, రహదారుల విస్తరణ చేయకపోవడంతో వాహనాలు ఎక్కడ పెట్టాలన్నా పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు నిత్యం నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. దుకాణాల వద్దకు షాపింగ్‌కు వాహనాల్లో వచ్చినవారు వాహనాలు ఎక్కడ నిలిపి ఉంచాలబ్బా..అంటూ అయోమయానికి గురవుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపితే ట్రాఫిక్‌కు ఇబ్బందిగా తయారవుతోంది. దుకాణాల వారు కూడా మీ వాహనాలు ఎక్కడైనా పెట్టుకోండి..దుకాణాల వద్ద పెడితే ఎలా?..అంటూ కసురుకుంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిశీలించి వాహనాలకు పార్కింగ్ స్థలాలు కొదవలేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్. శారదకుమార్, నెల్లూరు.

# నీటి కటకట పట్టించుకోండి

గుడ్లూరు మండలంలోని అడవిరాజుపాళెం దళితవాడలో నీటి పైపులు చెడిపోయి రెండు వారాలైంది. మరమ్మతులు చేయాలని పెద్ద గుంతను తవ్వారు కానీ, ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదు. దీంతో ఇక చేసేది లేక అక్కడి ప్రజలు నిత్యం దూర ప్రాంతాల్లో ఉన్న పొలాల్లో మోటార్‌ల వద్దకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకోవాల్సి వస్తోంది. మహిళలు, గృహిణులు నీటి కోసం కోటి బాధలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు ఈ దుస్థితిని పరిశీలించి ఆ పైపులైన్ల మరమ్మతులను వెంటనే పూర్తిచేయించి ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాటు చేయగలరని ప్రార్థన.




ఏ. భూమయ్య, గుడ్లూరు.

## రెడ్‌క్రాస్ సేవలు

# అభినందనీయం

నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ సంస్థ వారు మానసిక దివ్యాంగులకు, ఎంతోమంది పేద రోగులకు, ఇటీవల మిచౌంగ్ తుఫాన్ బారిన పడిన అనేకమంది పేదలకు తమవంతు సేవలందించడం అభినందనీయం. ఎక్కడ బాధితులంటే అక్కడ రెడ్‌క్రాస్ ప్రత్యక్షమై తానున్నాంటూ బాధితులను ఆదుకుంటుండడం హర్షదాయకం. రెడ్‌క్రాస్ నిర్వాహకులకు, వలంటీర్లకు ధన్యవాదాలు.

కె. కరుణాకర్, నెల్లూరు.

# గగనతలంలో..ఘన విజయం



***చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 ప్రయోగ విజయాలతో గత ఏడాది చరిత్ర సృష్టించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త ఏడాది 2024న మొదటరోజు (జనవరి 1)నే గగనతలంలో మరో ఘనవిజయం సాధించింది. అంతరిక్షంలో అంతుపట్టని కృష్ణబిలాల గుట్టుమట్లు శోధించేందుకు ఎంతో సాహసంతో చేపట్టిన ఈ ప్రయోగంలో కూడా ఇస్రో తనదైన ప్రతిభాపాటవాలతో ముందుకు దూసుకుపోతోంది. సోమవారం నాడు ఇస్రో అధిపతి సోమనాథ్ సారధ్యంలో చేపట్టిన పిఎస్ఎల్వి-సి 58 ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం కావడం, శ్రీహరికోటలోని షార్ నుంచి ఉదయం 9.10 గంటలకు ఎక్స్‌పో శాట్ నింగిలోకి దూసుకుపోయి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంతో షార్ శాస్త్రవేత్తలతో పాటు, దేశవ్యాప్తంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.***

కొత్తసంవత్సరం రోజునే విజయారంభంతో ఇస్రో తొలిబోణీ కొట్టింది. ఇస్రోకి రామబాణంగా ప్రసిద్ధిచెందిన పిఎస్ఎల్వి సీరీస్‌లో 58వ రాకెట్ రివ్వుమంటూ నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగసింది. 44.4 మీటర్ల పొడవు, 260 టన్నుల బరువున్న పీఎస్ఎల్వి రాకెట్ ప్రయోగించిన 21 నిమిషాల్లోనే ఆకాశంలోకి దూసుకుపోయి అనుకున్న లక్ష్యానికి చేరుకుని అందరికీ ఆనందాన్ని పంచింది. శ్రీహరికోటలోని షార్ కేంద్రం మొదటి ప్రయోగవేదిక మీదనుంచి ఎక్స్‌పో శాట్ (ఎక్స్‌రే పొలారిమీటర్ శాటిలైట్) ఉపగ్రహాన్ని మోసుకుని 650 కిలోమీటర్ల ఎత్తున ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది. 469 కిలోల బరువున్న ఎక్స్‌పో శాట్ ఉపగ్రహంతో పాటు, కేరళ యూనివర్శిటీ విద్యార్థినులు వాతావరణ పరిశోధనల కోసం రూపొందించిన వియ్‌శాట్ (కేజీ బరువున్న బుల్లి ఉపగ్రహం)తో పాటు, ప్రయోగం చివరిదశలో మరో 10 పరికరాలతో కూడిన పీఎస్ఎల్వి ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్‌ను కూడా కక్ష్యలోకి దిగ్విజయంగా ప్రవేశపెట్టింది. ఈ ఎక్స్‌పో శాట్ అయిదేళ్లపాటు అంతరిక్షం నుంచి పరిశోధనలు చేస్తుంది.

## కృష్ణబిలాలను శోధించే దిశగా

విశ్వాంతరాళాల్లో దాగి ఉన్న అనేక రహస్యాలను కనుగొనేందుకు, అంతులేని గురుత్వాకర్షణ శక్తితో కాంతిని సైతం తనలోకి లాగేసుకునే కృష్ణబిలాల గుట్టు విప్పే అధ్యయనానికి ఈ ప్రయోగం ద్వారా ఇస్రో శ్రీకారం చుట్టినట్లైంది. ముఖ్యంగా ఖగోళ వ్యాప్తి చెందే ఎక్స్‌రే తరంగాల పుట్టుకను గుర్తించే లక్ష్యంతో ఇస్రో ఈ నూతన, అధునాతన ఎక్స్‌పో శాట్ ప్రయోగానికి సంకల్పించింది. అమెరికా తర్వాత ఇప్పుడు అలాంటి ప్రయోగం చేయడానికి సాహసించింది భారత్ ఒక్కటే కావడం విశేషం. కృష్ణబిలాలు, పాలపుంత కేంద్రకాలు, న్యూట్రాన్ స్టార్స్ నుంచి వెలువడే అత్యంత తీక్షణమైన, దేదీప్యమానంగా ప్రకాశించే కాంతిపుంజాల మూలాలను పరిశోధించేందుకు తొలిసారిగా ఇస్రో ఈ ప్రయోగం చేపట్టింది. అమెరికా తర్వాత, అంతరిక్షంలోని కృష్ణబిలాల అధ్యయనానికి అబ్జర్వేటరీ శాటిలైట్ కలిగి ఉన్న రెండవ దేశంగా భారత్ అవతరించడం, అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ఏడాదికేడాది మరింతగా రాకెట్ వేగంతో దూసుకుపోతుండడం భారత్‌కు గర్వకారణం. ఇస్రో ఇప్పటికి 60 పిఎస్ఎల్వి రాకెట్లను ప్రయోగించగా, కేవలం రెండు మాత్రమే వైఫల్యం చెందగా, 58 రాకెట్‌లు విజయవంతం కావడం ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం.

# భారత ప్రజలకు 'ఇస్రో' బహుమతి

## ఇస్రో అధిపతి డా. సోమనాథ్



ఈ విజయం భారత ప్రజలు ఇస్రో బహుమతి అని, 1963 తర్వాత జరిగిన ప్రయోగాల నేపథ్యంలో.. నేటి తాజా విజయంతో ఇస్రో 60 ఏళ్ళ ఘనమైన చరిత్రను పూర్తిచేసుకుందని ఈ సందర్భంగా ఇస్రో అధిపతి డా.సోమనాథ్ అన్నారు. భవిష్యత్ ప్రయోగాలకు ఇదెంతో కీలకమని, ఈ ఏడాది 12 ప్రయోగాలను లక్ష్యంగా పెట్టుకున్నామని, పీఎస్ఎల్వి, జీఎస్ఎల్వి రాకెట్ ప్రయోగాలు కూడా ఉంటాయని, అదేవిధంగా మానవ రహిత గగన్‌యాన్ ప్రయోగం కూడా ఈ ఏడాదే చేపట్టనున్నామని, 2025లో మానవసహిత గగన్‌యాన్ కూడా సిద్ధమవుతున్నాని ఆయన చెప్పారు.

నాసాతో కలసి రూపొందించిన ఇన్‌శాట్-త్రీ డీ ఉపగ్రహాన్ని త్వరలోనే ప్రయోగిస్తామని, ఈనెల 26న లేదా ఫిబ్రవరి తొలి వారంలో నావిక్-02 ఉపగ్రహ ప్రయోగానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు.

# పీఎస్ఎల్వీ-సీ58 విజయం అద్భుతం

- **ఇస్రో ఛైర్మెన్‌ను అభినందించిన శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి**



పీఎస్ఎల్వీ సీ-58 రాకెట్ ప్రయోగం అద్భుతమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. జనవరి 1న ఆ ప్రయోగం విజయవంతమైన అనంతరం ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ ఎస్.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, షార్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆ అద్భుత ఘట్టాన్ని షార్ మిషన్ కంట్రోల్ సెంటర్‌లో కూర్చొని వీక్షించిన ఆయన, అంతరిక్ష సాంకేతికతలో అగ్రగ్రామిగా భారతదేశం స్థానాన్ని సుస్థిరం చేస్తూ, ఈ విజయాన్ని అందించిన ఇస్రో బృందం కృషిని, అంకితభావాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వేగవంతమైన ప్రగతిని వివరిస్తూ, తాజా అభివృద్ధిని ప్రత్యక్షంగా తిలకించేందుకు, ఇస్రోకు సహకరిస్తున్న పరిశ్రమల సీఈఓలతో సంభాషించడానికి శ్రీసిటీని సందర్శించాలంటూ డాక్టర్ సోమనాథ్‌ను రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని హృదయపూర్వకంగా అంగీకరించిన డాక్టర్ సోమనాథ్, మే 2019లో విఆర్‌వి (చార్ట్ గ్రూప్) పరిశ్రమకు చెందిన క్రయోజెనిక్ ట్యాంక్‌ను షార్‌కు అప్పగించే కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చినప్పుడు తన శ్రీసిటీ సందర్శనను గుర్తు చేసుకుంటూ, ఇస్రోకు శ్రీసిటీకి చెందిన కొన్ని కంపెనీల కీలకమైన సహకారానికి అభినందనలు తెలిపారు. కాగా, శ్రీసిటీకి చెందిన విఆర్‌వి (చార్ట్ గ్రూప్), రోటోలోక్, వాల్-మెట్ ఇంజినీరింగ్, నోవా ఎయిర్, సిద్దార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలు, తమ ఉత్పత్తుల సరఫరా, సేవల ద్వారా చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 మిషన్‌లతో సహా వివిధ ఇస్రో ప్రాజెక్టులలో పాలు పంచుకున్నాయని, ఆ సహకారం శ్రీసిటీ ప్రగతిలో ఓ ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని డా. రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.

# డా. శివశంకరయ్యకు.. మరో విశిష్ట పురస్కారం




ప్రముఖ సాహితీవేత్త, మర్రిపాడు మండలం చుంచులూరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా ఉంటూ, సాహితీ పరిశోధనల్లో మేటిగా రాణిస్తూ అనేక అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్న మున్నెల్లి శివశంకరయ్య మరో విశిష్ట అవార్డును అందుకున్నారు. సాహితీ రంగంలో ఆయన చేస్తున్న అపూర్వ పరిశోధనలకు మెచ్చి, తమిళనాడులోని హోసూరుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం వారు ఇటీవల ఆయనకు గౌరవ డాక్టరేట్(జీవిత సాఫల్య డాక్టరేట్)ను బహుకరించారు. వందల సంవత్సరాల క్రితమే 'రామాయణం'ను అత్యద్భుతంగా రచించిన మహాకవయిత్రి మొల్లమ్మ జీవిత విశేషాలన్నిటినీ శివశంకరయ్య సేకరించారు. మొల్లమాంబ పోస్టల్ స్టాంప్ విడదలలోనూ, మొల్ల జన్మస్థానంపై సాహిత్య లోకంలో అనేక అనుమానాలను నివృత్తి చేయడంలోనూ ఆయన కృషి అపారం. మొల్లమ్మ నెల్లూరు జిల్లా వాసి అని, అందులో ఎలాంటి సందేహం అక్కరలేదని, ఆమె పూజించిన శ్రీకంఠమల్లేశ్వర స్వామి దేవాలయం నెల్లూరుజిల్లా కలువాయి సమీపంలో ఉందని ఆయన దాదాపు 76 ఆధారాలతో సహా నిరూపించారు. 12వ శతాబ్దంలో నెల్లూరు సీమను పాలించిన మనుమసిద్ధి మహారాజు వద్ద మంత్రిగా ఉన్న కవిబ్రహ్మ తిక్కన రచించిన మహాభారతంలోని ఉద్యోగపర్వం తాళపత్ర గ్రంధాన్ని, వీరబ్రహ్మేంద్ర స్వామివారి కాలజ్ఞాన తత్త్వాలను కూడా ఆయన తన పరిశోధనలో సేకరించారు. మరో ప్రత్యేకత ఏమిటంటే, కేవలం నూలు దారాలతోనే అద్భుత కళాఖండాలు సృష్టించే నైపుణ్యం ఆయన సొంతం. ఆ కళలో ఆయనకాయనే సాటి. దీంతో, అత్యుత్తమ కళాకారునిగా ఆయన అనేక అంతర్జాతీయ స్థాయి అవార్డులు కూడా పొంది ఉండడం విశేషం.

AUTHORISED DEALER
Raymond
79 సం॥లు పూర్తి చేసుకుని
80వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా
మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
కృతజ్ఞతాభివందనములతో...
2024 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మాడరన్ స్టోర్స్
ట్రంకురోడ్డు, నెల్లూరు. ☎ 2326462
SINCE: 1944
సూటింగ్స్ • షర్టింగ్స్ • రెడీమేడ్స్

# నెల్లూరు కబుర్లు

## ఉన్నత విద్యకు భరోసా

**జిల్లా విద్యార్థులకు రూ. 30.45 కోట్ల 'జగనన్న విద్యాదీవెన'**



విద్యార్థులకు ఉన్నత విద్యపై భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 40740 మంది విద్యార్థులకు రూ. 30.45 కోట్లు నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ఆ నిధులను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, అధికారులు, వర్చువల్‌గా పాల్గొన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థిక కష్టాలతో తమ పిల్లలను ఉన్నత విద్య చదివించడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థులకు ఓ వరంలా మారిందని జేసీ అన్నారు.

## సాయిదర్బార్‌లో ప్రత్యేక పూజలు



నూతన సంవత్సరం సందర్భంగా నెల్లూరు లోని సాయిదర్బార్ అద్దాలమందిరంలో వేడుకలు జరిగాయి. తొలుత ఆలయంలో కొలువైవున్న శ్రీ షిర్డీ సాయినాథునికి ప్రత్యేక పూజలు చేసి, డిసెంబరు 31వ తేదీ రాత్రి 9 నుంచి 12 గంటల వరకు సాయినామ సంకీర్తన చేస్తూ, ప్రజలందరూ ఈ నూతన సంవత్సరాన సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. మందిరం ఛైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో, శ్రీ సాయిభక్త బృందంతో కలిసి ఈ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులందరికీ శ్రీసాయిబాబా నూతన క్యాలెండర్, నూతన పాకెట్ ఫోటో, ఊదీ ప్రసాదాలను అందజేశారు.



## వీపీఆర్‌కి శుభాకాంక్షల వెల్లువ

రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని ఆయన నివాసానికి చేరుకున్న అనేకమంది జిల్లా నాయకులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, పార్టీ జిల్లా కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు వేమిరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో..**

## ఉత్సవమూర్తి ప్రాణప్రతిష్ట



నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నూతన ఉత్సవమూర్తి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి జనవరి 2న అంకురార్పణ జరిగింది. తొలుత ఆలయ అర్చకులు నవగ్రహ మండపారాధన, కలశస్థాపనలు శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారికి అభిషేక సేవలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా నెల్లూరులోని మురళీకృష్ణ గ్రూప్స్ అధినేత గోనుసుబ్బారావు, సత్యలక్ష్మి వ్యవహరించారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇఓ అరవభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త భవనంలో..'నుడా' కార్యాలయం



నెల్లూరు నగరంలోని గాంధీనగర్‌లో దాదాపు ఆరు కోట్ల రూపాయల వ్యయంతో కొత్తగా నిర్మించిన నుడా (నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ) కార్యాలయ భవనానికి ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు ప్రారంభోత్సవం గావించారు. 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఏఎంసి ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, వైకాపా నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఇంతియాజ్, కో-ఆప్షన్ సభ్యురాలు మొబినా తదితరులు పాల్గొన్నారు.

## 'సంజీవని' పథకానికి విరాళం



నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న 'సంజీవని' వైద్యసేవా పథకానికి సంస్కృత అధ్యాపకులు బండి విశ్వనాథం జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుడు బండి సత్యమురళి ఇటీవల లక్షా 50 వేల రూపాయ లను విరాళంగా అందజేశారు. ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ సమక్షంలో ఆ చెక్కును జయభారత్ ట్రస్టు సభ్యులు డాక్టర్ సివి సుబ్రహ్మణ్యంకు అందజేయగా, దాతకు వారిరువురు ధన్యవాదాలు తెలిపారు.

## సౌజన్యలక్ష్మికి డాక్టరేట్



నెల్లూరు మూలాపేటకు చెందిన సౌజన్యలక్ష్మి 'సముద్ర మత్స్యకారుల గ్రామీణ అభివృద్ధిలో ఆర్థిక పాత్ర' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఇటీవల డాక్టరేట్ లభించింది. కావలి కళాశాల కామర్స్ ప్రొఫెసర్ వెంకట్రావు పర్యవేక్షణలో ఆమె ఈ పరిశోధన చేశారు. విఎస్‌యు ఆధ్వర్యంలో ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

## 'తంగిరాల మహాభారతం' 88వ భాగం

ద్రౌపది తనకు జరిగిన అవమానభారం సహించలేక ధర్మరాజుని కౌరవుల మీద పగ తీర్చుకోమని కోపగించుకున్నప్పుడు... ధర్మరాజు అంగీకరించక, కోపం పనికిరాదని, తను ధర్మమార్గాన్ని ఎల్లప్పుడూ అతిక్రమించనని దృఢంగా చెబుతాడు.

అప్పుడు భీమసేనుడు ద్రౌపదికి మద్దతు పలికి, శాస్త్రప్రకారం అరణ్యవాసం ముగిసిందని, శత్రువులని నిర్జించడానికి అనుమతి




కోరినప్పుడు, ధర్మరాజు కౌరవ వీరుల పరాక్రమం గురించి వివరించి ముందు భీష్మ, ద్రోణ, కృపా, కర్ణులను ఓడించిన తర్వాతే దుర్యోధనాదుల మీద సంగ్రామం చేయాలని, అదంత సులువుకాదని తిరస్కరిస్తాడు.

ధర్మరాజు కౌరవ వీరుల బలపరాక్రమం గురించి ఆందోళన పడుతున్నాడని గ్రహించి వేదవ్యాసుడు ప్రత్యక్షమై ధర్మరాజుకు అభయం ప్రసాదిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## విఎస్‌యులో ముగిసిన క్రికెట్ పోటీలు



విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన నెల్లూరు జోన్ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో నెల్లూరుకు చెందిన కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల జట్టు మొదటి బహుమతి సాధించగా, విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం, విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య. జి.ఎం సుందరవల్లి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య. పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య. విజయ ఆనంద్‌కుమార్‌బాబు, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డా. కె.సునీత, టోర్నమెంట్ పరిశీలకులు డా. పి.ప్రసాద్‌రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి డా. ఏ.ప్రవీణ్‌కుమార్, రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి రిజర్వాయర్ పూడికతీయండి

జిల్లాలోని కనిగిరి రిజర్వాయర్ పూడిక తీయాలని, తద్వారా 2.5టీఎంసీల నీటిని అదనంగా వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ జనవరి 2న నెల్లూరు జలవనరుల శాఖ పరిపాలన అధికారి కృష్ణయ్యను కలసి విజ్ఞప్తి చేశారు. కనిగిరి రిజర్వాయర్ 1884లో నిర్మించారని, ఇప్పటికి 140 ఏళ్ళు అయిందని, పూడికతో రిజర్వాయర్ నిండిపోయిందని ఆయన పేర్కొన్నారు. 6టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న కనిగిరి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.5 టీఎంసీలు నీరు మాత్రమే నిల్వ ఉంటోందని, పూడికతీత ద్వారా రిజర్వాయర్‌ను బలోపేతం చేసి 6టీఎంసీల నీరు నిల్వ ఉండేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# మంచి చేయడం.. నా స్వభావం

## నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



'ప్రజా సమస్యలు పరిష్కారం చేయడం, ప్రజలకు మంచి చేయడమే నాకు తెలుసు. ఎవరికైనా సరే..చివరికి విరోధులకు కూడా మంచి చేయడం నా స్వభావం' అన్నారు నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి. ఇటీవల నెల్లూరు రూరల్‌లోని 1వ డివిజన్ నారాయణరెడ్డిపేటలో రూ. 40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలుకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం, శ్రీ సీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో రాజగోపురం, శిఖర కలశ ప్రతిష్టలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, తానెవరికీ చెడ్డ చేసేది ఉండదని అన్నారు. నారాయణరెడ్డిపేట గ్రామ అభివృద్ధికి మరో రూ. 15 లక్షల నిధులను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన రీతిలో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానాన్ని నిర్మించిన గ్రామ నాయకులను, సహకరించిన గ్రామస్తులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పోట్లూరు స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ జానా నాగరాజ్ గౌడ్, పార్టీ నాయుకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, వాల్మీకి లక్ష్మీనరసారెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, ఏయంసీ వైస్‌ఛైర్మెన్ సుధాకర్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, నాపా సుబ్బారావు, నూనె మల్లికార్జునయాదవ్, జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి అభ్యర్థిగా పోటీచేస్తా

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల్లో వైకాపా వెంకటగిరి నియోజకవర్గ అభ్యర్థిగా తాను పోటీచేస్తానని వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వెంకటగిరిలోని హనుమాన్‌నగర్‌లో ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించిన నాటినుండి పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు కృషిచేస్తున్నానని చెప్పారు. 'నేతన్న నేస్తం' నిధులు విడుదల సమయంలో వెంకటగిరికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభ అద్భుతమైన రీతిలో విజయవంతం కావడం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం చేపడుతున్న బస్సు యాత్ర కూడా జనవరి 5వ తేదీన వెంకటగిరి నియోజకవర్గం నుండి ప్రారంభమై, డక్కిలి–రాపూరు మండలాల మీదుగా కొనసాగుతుందని, రాపూరులో బహిరంగ సభ ఉంటుందని, సీఎం సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### పెంచలస్వామి క్యాలెండర్ ఆవిష్కరణ :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. పెంచలకోనలో కొలువైవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇటీవల రామ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ నిర్వాహకులు, రాపూరు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# అవినీతిని ప్రశ్నిస్తే...

# అక్రమ కేసులా?

## ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తిన మాజీమంత్రి సోమిరెడ్డి



అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తారా?.. ఇదెక్కడి న్యాయం అంటూ మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. ఇటీవల ఉదయగిరిలో టీడీపీ నేతలపై కేసులు పెట్టడాన్ని ఆయన ఖండిచారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ విధానాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వారి కక్షసాధింపులకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని మండిపడ్డారు. ప్రశ్నించే హక్కును ప్రభుత్వమే హరించేస్తోందని, అక్రమాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయించడం ఎక్కడి పద్ధతని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయగిరిలో పేదలకు ఇళ్లకు ఉపయోగించాల్సిన సబ్సిడీ సిమెంట్‌ను హౌసింగ్ అధికారి ఒకరు సొంత భవన నిర్మాణానికి ఉపయోగిస్తూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు తదితరులకు అడ్డంగా దొరికి పోయారని, కాలనీ ఇళ్లకు ఉపయోగించాల్సిన కంకర, రాళ్లను కూడా ఆ అధికారి సొంత అవసరాలకు తోలుకున్నట్లు గుర్తించారని ఆయన అంటూ, అలా దొరికి పోయిన అధికారి మరింత బరితెగించి వైసీపీ నేతలతో కలిసి టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడటం దురదృష్టకర పరిణామమన్నారు. దాడి చేసిన వారిపై కేసులు లేవు కానీ అక్రమాలను బయట పెట్టి, దాడులకు గురైన బాధితులు మాత్రం నిందితులుగా మారిపోయారని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సంబంధం లేని వారితో అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు పెట్టించడం దుర్మార్గమని ఆయన దుయ్యబట్టారు.

## 6న ముత్తుకూరులో..

# బస్సు యాత్ర

సర్వేపల్లి నియోజకవర్గంలో గత నవంబర్‌లో జరగాల్సిన సామాజిక సాధికార బస్సుయాత్ర జనవరి 6వ తేదీ సాయంత్రం ముత్తుకూరులో నిర్వహించనున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు వైకాపా కార్యాలయంలో ఈనెల 2న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు తమ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా సభలో వివరిస్తామని, పలువురు మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొంటారని, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.




## దేశంలో ఎక్కడా లేని విధంగా..

# రూ. 3 వేలు పింఛన్

దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్దఎత్తున పింఛన్లను వాలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకు చేరుస్తూ, ఇచ్చిన మాట ప్రకారం రూ. 3 వేలు పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. జనవరి 2న పొదలకూరు ఎంపీడీవో కార్యాలయంలో పొదలకూరు మండలానికి సంబంధించి నిర్వహించిన వైయస్సార్ పెన్షన్ కానుక రూ. 3 వేలు పెంపు, నూతన పింఛన్ల మంజూరు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా రూ. 3వేలకు పింఛన్ మొత్తాన్ని ముఖ్యమంత్రి పెంచడం హర్షదాయకమన్నారు, భారతదేశంలో పింఛన్ల పంపిణీలో ఏ రాష్ట్రాలు కూడా మన దరిదాపుల్లో లేవన్నారు. వివిధ రకాల పింఛన్లకు రూ. 3 వేల నుంచి రూ. 10వేల వరకు అందిస్తూ, ప్రతినెలా రాష్ట్ర వ్యాప్తంగా 66,08,225 మంది లబ్ధిదారులకు రూ 1959.38 కోట్లు పింఛన్లకు కేటాయిస్తున్నారని, జిల్లాలో 3,19,952 మంది లబ్ధిదారులకు రూ. 95.54 కోట్లు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీవో నగేష్‌కుమారి, తహశీల్దార్ వీర వసంత కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి

## ఎస్వీయు కొత్త వీసీకి... ఏబీఆర్ఎస్ఎం నాయకుల వినతి



ఎస్వియు అధ్యాపకులు ఎంతోకాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారని, వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబిఆర్ఎస్ఎం) రాష్ట్ర శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, కోశాధికారి ప్రొ. ఎం.రాజశేఖర్‌లు కోరారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డిని వారు ఇటీవల కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా, విశ్వవిద్యాలయంలో గత రెండు సంవత్సరాలుగా కెరియర్ అడ్వాన్సుడ్ స్కీం ప్రమోషన్స్ చేపట్టలేదని, దాదాపు 100 మంది అధ్యాపకులు పదోన్నతుల కోసం వేచి చూస్తున్నారని, సిఎఎస్ ద్వారా వారికి పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కొత్త వీసీ స్పందిస్తూ, వీలైనంత త్వరగా వారికి పదోన్నతులు కల్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి విద్యాసంస్థల ఇన్‌చార్జి డాక్టర్ వి పద్మావతమ్మ, ప్రతినిధులు డాక్టర్ రంజని, డాక్టర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



## అమెరికాలో విద్యావకాశాలపై..

# ఎన్‌బికెఆర్‌లో అవగాహన సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అమెరికాలోని ప్రముఖ యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్-డార్ట్‌మౌత్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న విజయ చలివేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్‌బికెఆర్ కళాశాలతో యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్‌తో జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ కళాశాలలో చదివే విద్యార్థులకు బీటెక్‌తో పాటు అమెరికాలో ఎమ్మెస్ ఐదు సంవత్సరాల్లో పూర్తి చేసే అవకాశం ఉందని తెలియజేశారు. ప్రస్తుతం ఇండస్ట్రియల్ & సిస్టం ఇంజనీరింగ్ మరియు డేటా సైన్స్‌లలో ఒప్పందం కుదిరిందని, త్వరలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ టెక్నాలజీ కోర్సులలో కూడా ఒప్పందం కుదుర్చుకుంటున్నామని తెలియజేశారు. ఈ ఒప్పందం ద్వారా ఎన్‌బికెఆర్‌లో ద్వితీయ, తృతీయ సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఎమ్మెస్ ప్రోగ్రాంకి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రోగ్రాంకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు ఎన్.బి.కె.ఆర్‌లో బీటెక్ కోర్సు పూర్తయ్యే లోపల ఎమ్మెస్ ప్రోగ్రాంలో భాగంగా మూడు కోర్సులు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు అప్లికేషన్స్ ఆఫ్ కార్బన్ నానో ట్యూబ్ ఇన్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అనే అంశం మీద అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్, అధ్యాపకులు శ్రీనివాసులు, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొట్టేపాళెం అధ్యాపకునికి గౌరవ డాక్టరేట్

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామానికి చెందిన గణితశాస్త్ర అధ్యాపకులు వీవీ లక్ష్మీప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూరులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ ప్రతినిధులు ఆయనకు ఆ పురస్కారాన్ని అందజేశారు. 'అప్లికేషన్స్ ఆఫ్ మేథమేటిక్స్ ఇన్ క్రిప్టోగ్రఫీ' అనే అంశంపై ఆయనకు ఈ అవార్డు లభించింది. ప్రస్తుతం నంద్యాలలోని ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాలలో ఐఐటి మాథ్స్ లెక్చరర్‌గా ఆయన పనిచేస్తున్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# చీపురు పట్టిన మునిసిపల్ కమిషనర్

మునిసిపల్ కమిషనర్ చీపురు పట్టారు. ఈ నెల 3వ తేదీ వేకువజామున రైల్వేస్టేషన్ నుండి సంగం థియేటర్ సెంటర్ వరకూ కిలోమీటర్‌పైగా ప్రధాన రహదారిపై చెత్తచెదారం తొలగించారు. ఆయనతోపాటు మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది 30మంది వరకూ శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. సమ్మెలో ఉన్న కార్మికులు స్వచ్ఛందంగా వస్తున్న ప్రైవేటు కార్మికులకు అడ్డుపడకూడదని, సమ్మెకు తాము వ్యతిరేకం కాదన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో స్వయంగా చీపురు పట్టాల్సివచ్చిందన్నారు.

# కుమ్మరి వీధికి నీరందించండి



అంతర్గత గ్యాస్ పైప్‌లైన్ కనెక్షన్ల పేరుతో గూడూరును గుల్ల గుల్ల చేసి మంచి నీరందించే పైపు లైన్లను తీవ్రంగా దెబ్బతీశారు. దీనివల్ల పట్టణంలో ఎన్నో చోట్ల మంచినీటికి అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా చిన్న కుమ్మరి వీధిలో దాదాపు ఆరు నెలలకు పైగా మంచినీరు సరఫరా అందక ఆ ప్రాంత నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ఎంతోమంది పురపాలక అధికారులకు తమ గోడు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో చిన్న కుమ్మరివీధి నివాసితులు ఇటీవల కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి తమ ప్రాంతానికి నీరు అందించే విధంగా పైప్‌లైన్ల మరమత్తులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత నివాసితులు మురళి, గూడూరు రంగబాబు, మైలా పెంచలయ్య, గూడూరు సందీప్, నల్లిబోయిన తేజోకిషన్ యాదవ్, పప్పు వీరేంద్ర తదితరులున్నారు.

# ఘనంగా నల్లపరెడ్డి హరినాథరెడ్డి జయంతి



గూడూరు నియోజకవర్గం కోట పట్టణంలోని స్వర్గీయ నల్లపరెడ్డి హరినాథ రెడ్డి 71వ జయంతి వేడుకలను ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి కుమారుడు వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నల్లపరెడ్డి అభిమానులు కోట పంచాయతీకి హరినాథరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చేతులమీదుగా దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ నల్లపరెడ్డి హరినాథరెడ్డి జ్ఞాపకార్థం తన మేనమామ విశ్రాంత హోమ్స్ అధినేత దివ్యాంగులకు ట్రైసైకిల్స్ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కోట సర్పంచ్ ఇండ్ల వెంకట రమణమ్మ, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సంతోషంగా జీవించాలి

## - పొణకా దేవసేనమ్మ




నూతన సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ ఆకాంక్షించారు. అన్ని సామాజిక వర్గాలు సుస్థిరమైన అభివృద్ధిపథంలో ప్రయాణించేలా కృషి చేస్తున్న ప్రభుత్వానికి, రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ 2024లో దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని కోరుకుంటున్నానన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని దేవసేనమ్మ కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా వైకాపా అభిమానులు దేవసేనమ్మను శుభాకాంక్షలతో ముంచెత్తారు.

# అందరి జీవితాలలో వెలుగులు నిండాలి



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వైకాపా సీనియర్ నాయకులు, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత బత్తిని విజయ కుమార్ నివాసంలో ఆయన అభిమానులు సందడి చేశారు. కేక్ కట్‌చేసి ఆయనకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బత్తిని విజయకుమార్ మాట్లాడుతూ ఈ 2024 నూతన సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలు పొందాలని ఆకాంక్షించారు. 2024లోనే జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రాన్ని సంక్షేమబాట పట్టించిన సీఎం జగన్‌ని మళ్ళీ గెలిపించాలని వైకాపా శ్రేణులను, ప్రజలను ఆయన కోరుతూ, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


2024 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో..
మయూరి స్వీట్స్ & బేకరి
ఎన్.టి.ఆర్. షాపింగ్ కాంప్లెక్స్, పాత బస్టాండ్, గూడూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
Branch: Near Sangam Theatre, Hospital Road, Gudur.



Dr. Bandi Shyamasundara Rao
(Mayuri Shyam Yadav)
Cell: 99486 06664
ఐ.సి.యస్.రోడ్, (సొసైటీ రోడ్) గూడూరు., సెల్: 8885524000-9848757611



మా ఖాతాదారులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2024 నూతన సంవత్సర మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ మర్చెంట్స్ అసోసియేషన్, గూడూరు.



LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA
నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
2024 ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ...
మీ... Ln. మల్లెమాల మురళీరెడ్డి
Dist., Chairman(Girls Education)
Rtd., LIC Development Officer, Gudur Branch.




గూడూరు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, కాంట్రాక్టర్లకు,
పంచాయతీరాజ్ సిబ్బందికి
2024 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ... కె.వి.రవీంద్రకుమార్
డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
పంచాయతీరాజ్ శాఖ, గూడూరు.





శుభాకాంక్షలు
రాష్ట్ర పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల
సంఘం గౌరవాధ్యక్షులు
షేక్ రియాజ్ అహమద్ గారికి
2024 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం
తిరుపతి - నెల్లూరు జిల్లా యూనిట్.



గూడూరు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు
2024 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
మీ..
చేవూరు విజయమోహన్‌రెడ్డి
మాజీ మండలాధ్యక్షులు
వైయస్ఆర్‌సిపి నాయకులు, గూడూరు.

# విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

- శ్రీసిటీ-ఐసాన్ పరిశ్రమ వితరణ



శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంచేందుకు స్థానిక పరిశ్రమలు చేయూత అందిస్తున్నాయి. ఇటీవల ఐసాన్ ఆటోమొబైల్ విడిభాగాల తయారీ పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల్లో భాగంగా రామచంద్రాపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. దీనితో పాటు రామచంద్రపురం పాఠశాల మరియు అంగన్‌వాడీ విద్యార్థులు 60 మందికి విద్యా పరికరాల కిట్లను పంపిణీ చేశారు. అందుకు సుమారు 2 లక్షల రూపాయలు వెచ్చించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ అట్సుషి సకాబే మాట్లాడుతూ, పర్యావరణ హిత చర్యలకు తమ కంపెనీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చెట్ల పెంపకం వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఐసాన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ చెట్ల పెంపకం కార్యక్రమం శ్రీసిటీ ప్రాంతంలో పచ్చదనం పెంపుతో పాటు పర్యావరణం పట్ల తమ నిబద్ధతను తెలియచేస్తుందన్నారు. ఐసన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు హిరోకీ మిత్సుయ్, గోపాల్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది, రామచంద్రాపురం గ్రామస్తులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు. అదేవిధంగా, శ్రీసిటీలోని ఎన్ ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ పరిశ్రమ తడ ఐటీఐ కళాశాల, ఇరుగుళం ప్రభుత్వ స్కూల్ ఆవరణలో, హుటామకి కంపెనీచే మత్తేరిమిట్ట ఎంపీయూపీ పాఠశాలలో మొక్కలు నాటారు.

## కలెక్టరేట్ వద్ద...
# రైతు ఆత్మహత్యా యత్నం

తన భూమిలోకి తనను వెళ్లనివ్వకుండా కొందరు ఇబ్బందిపెడుతున్నారంటూ ఆవేదనకు గురైన ఓ రైతు నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. అయితే స్థానికులు గమనించి అడ్డుకున్నారు. జలదంకి మండలం మద్దూరుపాడు గ్రామానికి చెందిన రైతు వెంకట రామయ్య జనవరి 2న నెల్లూరులోని కలెక్టరేట్ వద్దకు వచ్చాడు. తన భూమిలోకి తనను రానివ్వడం లేదని, ఆ విషయాన్ని అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని, డీజల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు.

## సమస్యను పరిష్కరించండి

**- కలెక్టర్ ఆదేశం**

ఆ రైతు సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్ వెంటనే స్పందించారు. సమస్యను సత్వరం పరిష్కరించాలని డీఆర్ఓ లవన్నను ఆదేశించారు. దాంతో, వెంకటరామయ్య వద్దకు వెళ్లిన డీఆర్ఓ ఆయన సమస్యలు తెలుసుకుని, సమస్యపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జలదంకి తహశీల్దార్‌కు సూచించారు. రైతును భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.

## ఢిల్లీలో రిపబ్లిక్ డే పెరేడ్‌కు..
# విఎస్‌యు నుంచి ఇద్దరు వలంటీర్లు




జనవరి 26న ఢిల్లీలో పెద్ద ఎత్తున జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)కు చెందిన ఇద్దరు వలంటీరు ఎంపికయ్యారు. విఎస్‌యు నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎస్.వనిత, కె.చందన ఢిల్లీ పెరేడ్‌కు ఎంపిక కావడం తమకెంతో గర్వకారణమని ఈ సందర్భంగా వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి సంతోషం వ్యక్తం చేస్తూ వారిరువురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియాకు కొరత లేదు

**- జేడీ సత్యవాణి**

జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్‌కు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలు సాగులో ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా యూరియా ఎరువును రైతులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి 49వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, రైతు భరోసా కేంద్రాలకు, వ్యవసాయ పరపతి సంఘాలకు, అదేవిధంగా ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరికొద్ది రోజుల్లోనే మరో 10వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని, యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

# తెలుగు రాజకీయాలపై జేడీ ప్రభావం!



తెలుగు రాష్ట్రాలలో 2011, 2012 ప్రాంతాలలో ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ ఒక సంచలనం.

సంచలనం కాదు, పెను సంచలనం. అప్పటివరకు ఆయన పేరుతో తెలుగు ప్రజలకు పెద్దగా పరిచయం లేదు. ఐపీఎస్ అధికారిగా ఆయన మహారాష్ట్ర క్యాడర్‌కు వెళ్లిపోవడమే ఇందుకు కారణం.

దేశంలోని ఇతర రాష్ట్రాలకు కేటాయింపు అయ్యే మన సివిల్ సర్వీసెస్ అధికారులు..., డెప్యుటేషనుపై స్వరాష్ట్రంలో ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు పనిచేసే వెసులుబాటు ఉంటుంది.

బయట రాష్ట్రాలలో పనిచేసే ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ సర్వీస్ అధికారులకు ఈ వెసులుబాటు ఉంటుంది.

అలా, మహారాష్ట్ర క్యాడర్‌లో ఐపీఎస్‌గా పనిచేసే లక్ష్మీనారాయణ, 2006 జూన్ 12వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీబీఐ డీఐజీగా డెప్యుటేషన్‌పై వచ్చారు. ముందు, ఐదు సంవత్సరాల డెప్యుటేషన్ మీదనే వచ్చినప్పటికీ, మధ్యలో ఆయనకు ఐజీగా పదోన్నతి లభించడంతో, సీబీఐకి జేడీ అవడంతో పాటు మరో రెండేళ్లు స్వరాష్ట్రంలో పనిచేసే అవకాశం కూడా లభించింది. ఐజీ క్యాడర్ అధికారిని సీబీఐలో జాయింట్ డైరెక్టర్ అంటారు.

ఇది ఆయన జీవితంలో ఓ కీలక మలుపు. తెలుగు సమాజంపై బలమైన ముద్ర వేసిన చారిత్రాత్మక మలుపు. వీవీ లక్ష్మీనారాయణల్లా... జేడీ లక్ష్మీనారాయణగా తెలుగువారికి గుర్తుండిపోయే మలుపు. ఆయనకు 'Larger than life' ఇమేజ్ తెచ్చిపెట్టిన మలుపు.

ఎంత చాకు లాంటి పోలీసు అధికారి అయినా సెవెన్-ఓ-క్లాక్ బ్లేడు లాంటి కేటుగాళ్ళు తారస పడకపోతే, ఆ పోలీసు అధికారి శక్తియుక్తులు లోకానికి వెల్లడికావు. చాకు కూడా కాలక్రమంలో తుప్పుపట్టి.... మొద్దుబారిపోయి, ఆ అధికారి రిటైర్ అయిపోతారు. కానీ, లక్ష్మీ నారాయణకు అదృష్టం వెదుక్కుంటూ వచ్చింది అనకొండల రూపంలో.

సీబీఐ జేడీగా ఆయన నిజాయితీ, దర్యాప్తు తీరు, వ్యవహారశైలి, నిర్భీతి, మెరుపు వేగంతో వలలు వేసి అనకొండలను పట్టి జైళ్లకు తరలించిన తీరు తెలుగు ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. గతంలో తెలుగునాట ఒక పోలీసు అధికారి ఈ విధమైన దర్యాప్తు చేయడం తెలుగు ప్రజలు కనీవినీ ఎరుగరు.

"జే.డీ" అనే రెండక్షరాలు ఆయన పేరుకు పర్యాయపదాలుగా తెలుగునాట ఇంటింటా మారుమోగాయి. ఊరూరా ఫ్లెక్సీలు. వాటికి పాలాభిషేకాలు. యువత పిచ్చెత్తిపోయింది.

అనకొండలన్నీ జైళ్లకు చేరాయి. డెప్యుటేషన్ కాలమూ పూర్తి అయింది.

దీంతో, ఆయన కూడా సీబీఐని వదిలేసి మహారాష్ట్రకు తిరిగివెళ్లి పోయారు... "జే.డీ" అనే రెండక్షరాలను మాత్రం ఇక్కడే వదిలేసి.

పోలీసు అధికారిగా సమాజానికి పెద్దగా సేవ చేయలేమనే భావంతో పాటు పుట్టి, పెరిగిన తెలుగు రాష్ట్రానికి తన ఋణం తీర్చుకోవాలనే తపనతో మహారాష్ట్ర క్యాడర్ పోలీస్ అధికారిగా సర్వీస్ చివరివరకూ లక్ష్మీనారాయణ కొనసాగలేకపోయారు. ఇంకా ఏడు సంవత్సరాల సర్వీస్ మిగిలి ఉండగానే 2018లో రాజీనామాచేసి వచ్చేశారు.

ఏపీని '2019 ఎన్నికల వాతావరణం' అలుముకుంటున్న రోజులు అవి. పవన్ కళ్యాణ్ మెల్లమెల్లగా యాక్టివేట్ అవుతున్నారు.

ఆయన ప్రధాన వ్యాపకం సినిమా ప్రపంచమే కనుక పోలీస్ సర్వీస్ వదిలేసి వస్తున్న జేడీని జనసేన






ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి, ప్రభంజనంలా పవన్ కళ్యాణ్ ఏపీని 2014లో లాగా చుట్టేస్తారనే ఊహాగానాలు చెలరేగాయి. అవి నిజం కాలేదు కానీ, జేడీ మాత్రం విశాఖ నుంచి జనసేన ఎం.పీ అభ్యర్థిగా పోటీచేశారు. గెలవలేదు కానీ 2 లక్షల 88 వేల 785 ఓట్లు తెచ్చుకోగలిగారు.

ఆ తరువాత, జనసేనలో నుంచి బయటకు వచ్చి రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటనలు చేస్తూ, రైతులను... యువతనూ విశేషంగా మోటివేట్ చేస్తూ వచ్చారు. అయినప్పటికీ రాజకీయ ఉద్దేశాలు మాత్రం ఆయనలో సజీవంగానే ఉన్నాయి. తాను వైజాగ్ నుంచే పోటీ చేస్తానని, ఏ పార్టీ తరఫునో చెప్పలేనని అంటూ రావడంతో, ఏ పార్టీలో ఆయన చేరుతారో అనే ఊహాగానాలకు లోటేమీలేకుండా పోయింది.

చివరకు, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడానికి జగనన్న వదులుతున్న బాణం కాదు గదా అనే ఆరోపణలు కూడా సోషల్ మీడియాలో కనిపించాయి. మొత్తం మీద ఆయన ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి.

"జైభారత్ నేషనల్ పార్టీ" పేరుతో ఆయన ఇటీవల ఒక రాజకీయపార్టీని ప్రకటించారు.

"ప్రత్యేకహోదా" ఏమైంది అనే భావోద్వేగ ప్రశ్నను బాగా రంగరించి, దానిని తన పార్టీకి మేళవించి మరీ ఆయన రంగంలోకి దిగుతున్నారు.

ఆయన పార్టీకి రెండు ప్రత్యేకతలు ఉన్నాయి.

1. రాష్ట్రవ్యాప్తంగా తెలిసిన ఆయన వ్యక్తిత్వం.
2. ఆయన లేవనెత్తుతున్న ప్రశ్న.

ప్రతి నియోజకవర్గంలోనూ ఒక శాతమో, రెండు శాతమో, మూడు శాతమో... ఇలా ఏదో ఒక శాతం మంది యువత ఆయన వైపు ఆకర్షితులవుతారు. అందులో సందేహం లేదు. అభ్యర్థులు ఉన్నప్పటికీ, లేనప్పటికీ ప్రతి నియోజకవర్గంలోనూ ఆయన ఒక టాకింగ్ పాయింట్ అవుతారు. ఈ "టాకింగ్ పాయింట్" అనేది అటు వైసీపీ, ఇటు టీడీపీ-జనసేన కూటమిలో ఏదో ఒకదాని విజయావకాశాలను ఏదో ఓ మేరకు ప్రభావితం చేస్తాయి. అది అర శాతం కావచ్చు, పావు శాతం కావచ్చు. ప్రభావితం చేయడం ఖాయం. కానీ, ఆయన ఆ పార్టీ జెండాను భుజాన వేసుకుని, వచ్చే అయిదేళ్లు ఊరూరా, సందు సందునా, గొంది గొందీ తిరుగుతారు. ప్రత్యేకహోదా ఎందుకు సాధించలేకపోయారు అంటూ అధికారంలోకి వచ్చిన వారిని ప్రశ్నిస్తూ తిరుగుతారు. రోజులు గడిచేకొద్దీ లక్ష్మీనారాయణ అడిగే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమవుతుంది.

ఇప్పుడు ఎన్నికల బంతిని ఆయన అటు టీడీపీ-జనసేన ఇటు వైసీపీ పార్టీల కోర్టుల్లోకి బలంగా నెట్టారు. ఏ పార్టీ ఎలా స్పందిస్తుందో చూడడానికి ఇంకా సమయం ఉంది.

చూద్దాం, జైభారత్ నేషనల్ పార్టీకి ఎంత శాతం ఓటింగ్ లభిస్తుందో... ఏ పార్టీ ఎలా స్పందిస్తుందో. 2024లో ఎంపీగా గెలవడం కోసమే ఆయన ఇప్పుడు పార్టీ పెట్టారని మాత్రం అనుకోవడం లేదు. చరిత్ర సృష్టించడం కోసమే పార్టీకి శ్రీకారం చుట్టారు. కాలం... ఏం చేస్తుందో చూద్దాం!

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# టార్గెట్ జగన్!

(మొదటి పేజీ తరువాయి)



చర్చకి తెరలేపారు. పైపెచ్చు వై.ఎస్.రాజశేఖరరెడ్డి 'కుటుంబం తరఫున' ఈ శుభాకాంక్షలు పంపడం ద్వారా, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తమ కుటుంబ సభ్యుడు కాదన్న సంకేతాన్ని ఆమె బలంగా జనంలోకి పంపారు. ఓవైపు తాను కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నట్లు, అందుకు ముహూర్తం కూడా ఖరారైందన్న వార్తలు వచ్చిన తరుణంలో షర్మిల లోకేష్‌కు క్రిస్టమస్ గ్రీటింగ్స్ పంపడం, వచ్చే ఎన్నికలలో కలిసి పనిచేద్దామనే సందేశాన్ని ఆమె పరోక్షంగా ఇచ్చారన్న చర్చ కూడా రాజకీయవర్గాలలో కొనసాగుతోంది. అంటే... బీజేపీకి టీడీపీ, జనసేనలు టాటా.. చీరియో... బై బై చెప్పవచ్చునని అంటున్నారు.

అది నిజమయ్యే పక్షంలో తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్, సిపిఐ ఒక కూటమిగా వైసీపీని ఎన్నికల్లో ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఈ సమీకరణ అంతిమంగా రూపుదిద్దుకుంటే కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి షర్మిల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం దాదాపు సంభవమే అనే అభిప్రాయం కూడా రాజకీయవర్గాలలో గట్టిగానే ఉంది. వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య కేసు ఆరోపణలు ఎదుర్కొంటున్న వై.ఎస్.అవినాష్‌రెడ్డి వైసీపీ నుంచి పోటీ చేస్తారు.

కడప నుంచి షర్మిల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తే, దాని ప్రభావం కడప జిల్లాలోనే గాక, రాయలసీమ మొత్తం మీద ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్‌కు ఎం.పీ సీట్లు కావాలి, టీడీపి, జనసేనకు శాసనసభ స్థానాలు కావాలి. కాబట్టి, బీజేపీని వదిలించుకోవాల్సి వస్తే, కాంగ్రెస్‌తో పొత్తుకు టీడీపి-జనసేన కూటమికి ఇబ్బంది ఉండకపోవచ్చు.

కొత్తగా ఓ పార్టీ పెట్టిన జేడీ(పూర్వపు) లక్ష్మీనారాయణ కూడా ఈ కూటమితో చేతులు కలిపే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు. ఆయన కూడా కలిస్తే.. ఈ కూటమికి 'మాసు', 'క్లాసు'తో పాటు ఒక 'ఇంటెలెక్చువల్ ఫ్లేవర్' కూడా తోడవుతుందని ఒక సీనియర్ రాజకీయవేత్త అభిప్రాయపడ్డారు. దీనివల్ల, రాష్ట్రవ్యాప్తంగా తటస్థులు కూటమి వైపు మొగ్గే అవకాశాలు లేకపోలేదు అన్నది కూడా ఒక అంచనా.

రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఇలా 'ఎన్నికల దూకుడు' మీద ఉంటే వైసీపీలో ఆ దూకుడు కనిపించడం లేదని రాజకీయవర్గాలు వ్యాఖ్యనిస్తున్నాయి.

ఎవరికి వైసీపీ టికెట్టు వస్తుందో.., ఎవరికి రాదో తెలియక వైసీపీ ఎంఎల్‌ఏలు టెన్షన్‌లో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గాలు మార్చినవారు కూడా సంతోషంగా లేరని అంటున్నారు. తమ సొంత మనిషి అనుకున్న ప్రశాంత్ కిషోర్ చంద్రబాబు శిబిరంలోకి వెళ్లడంతో టీడీపీదే విజయమా అనే భావన రాష్ట్రాన్ని కమ్మేసింది. ఎందుకంటే, గెలిచే పార్టీకే ఆయన సలహాలు ఇస్తారన్నది... రాజకీయవర్గాలలో ఆయనపై ఉన్న అభిప్రాయం. ఇదే 'భయం' వైసీపీ శ్రేణులలో కూడా వ్యక్తమవుతూ ఉండడం గమనార్హం. దీనికితోడు, అనేక అంశాలు... వైసీపీ ఆలోచనలకు అనుగుణంగా ముందుకు సాగడంలేదని కూడా అంటున్నారు. పైపెచ్చు వైసీపీ క్రమేణా అల్లరిపాలవుతోంది.

ఉదాహరణకు, లక్షల సంఖ్యలో దొంగఓట్లు చేర్పిస్తున్నారంటూ టీడీపీ నేతలు వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఢిల్లీ వరకూ వెళ్ళారు.

ఢిల్లీ నుంచి ఎన్నికల సంఘం ప్రతినిధులు విజయవాడ వచ్చి, రెండు రోజుల పాటు మొత్తం కలెక్టర్లు అందరితో మాట్లాడి వెళ్లారు. ఈ పరిణామంతో, దొంగఓట్లకు వైసీపీయే కారణం అనే భావన ప్రజలలో వచ్చిందని అంటున్నారు.

రామ్‌గోపాల్‌వర్మ తెలుగుదేశంను అల్లరల్లరి చేస్తూ తీసిన "వ్యూహం" సినిమాను విజయవాడ ప్రజలకు ముందుగానే చూపించాలనే ఉత్సాహంతో, మునిసిపల్ స్టేడియంలో స్టేడియం పట్టినన్ని కుర్చీలు వేసి, పెద్ద పెద్ద డిజిటల్ తెరలు ఏర్పాటు చేసినా... చూడడానికి జనం రాలేదు. జగన్ ప్రభుత్వంపై ఇది ప్రజాభిప్రాయానికి సూచికా అంటూ వైసీపీ నేతలు లోలోన మధనపడుతున్నట్టు సమాచారం.

ఎన్నికల వేళ జగన్‌ను చుట్టుముడుతున్న సమస్యలు అనేకం కనపడుతున్నాయి. ఉదాహరణకు చంద్రబాబుకు నైతిక మద్దతుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలుస్తారని వార్తలు రావడం, ఇదే సమయంలో వై.ఎస్.షర్మిల కాంగ్రెస్‌పార్టీలో చేరడం, వివేకా హత్యకేసు కొలిక్కిరాకపోవడం, వైసీపీ ఎంఎల్ఏల ధిక్కార స్వరాలు, ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, సలహాదారులపై జనంలో వ్యక్తమవుతున్న అసహనం, ఇసుక... మైనింగ్.... మద్యం వ్యాపారంపై వెల్లువెత్తుతున్న విమర్శలు, పోలీసుల నిర్వాకం... మొదలైన సమస్యలను జగన్ ఏ విధంగా అధిగమిస్తారన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

## అన్నని కలసిన చెల్లెలు!

తమ కుమారుడు రాజారెడ్డి పెళ్లి పత్రిక ఇచ్చే నెపంతో జనవరి 3వ తేదీ బుధవారం వై.ఎస్.షర్మిల తాడేపల్లిలోని ముఖ్యమంత్రి జగన్ నివాసానికి వెళ్లారు. కొద్దిసేపు అన్నతో ముచ్చటించి పెళ్ళికి ఆహ్వానించి తిరిగొచ్చారు. అక్కడినుండి నేరుగా ఢిల్లీకి వెళ్ళడానికి వచ్చిన షర్మిలని చుట్టుముట్టిన మీడియా బృందంతో షర్మిల నర్మగర్భంగా మాట్లాడారు. "తన సోదరుడిని పెళ్ళికి ఆహ్వానించానని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి వస్తానని చెప్పారు" అని ఆమె అన్నారు. సహజంగా ఏవైనా ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రికి అర్జీ ఇచ్చినప్పుడు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్తారు... ఇలా పెళ్లి పత్రిక ఇస్తే, ఆయన సానుకూలంగా స్పందించి పెళ్లికి వస్తానని అన్నారని షర్మిల చెప్పడం గమనించదగ్గ విషయం.

## కేసీఆర్‌ని కలిసిన జగన్!

రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారుతున్న తరుణంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రిని ఆంధ్ర సీఎం జగన్ కలవడం రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాలలో సంచలనం. కేసీఆర్ అనారోగ్యానికి గురై నెలరోజులయ్యింది. ఇన్ని రోజుల తరువాత జగన్ కేసీఆర్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ కావడం వెనుక రాజకీయ వ్యూహమే ఉందన్నది విశ్లేషకుల అంచనా. గడచిన రెండేళ్లుగా హైదరాబాదులోని లోటస్ పాండ్ ఇంటి వైపే చూడని జగన్, ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ఇంటికి వెళ్లడం కూడా పెద్ద చర్చనీయాంశమయ్యింది.

## కుటుంబాలలో చిచ్చుపెడుతున్నారు

**- వై.ఎస్.జగన్**

కాకినాడలో జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ "ఆంధ్రాలో కొత్త పొత్తులకి ప్రయత్నాలు జరుగుతున్నాయి, కుటుంబాలలో చిచ్చుపెట్టడానికి కొంత మంది పావులు కదుపుతున్నారు" అంటూ కామెంట్ చేశారు. అవి పరోక్షంగా కాంగ్రెస్‌పార్టీని, వారితో కలవబోయే ఇతర ప్రతిపక్ష పార్టీలని ఉద్దేశించి చేసిన కామెంట్లుగా విశ్లేషకులు చెప్తున్నారు. వై.ఎస్.షర్మిలని కాంగ్రెస్‌పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా తమ కుటుంబంలో చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోందని పరోక్షంగా జగన్ తన అభిప్రాయాన్ని వ్యక్తపరచారని అంటున్నారు.

ఏదేమైనా, 2024 ఆరంభదశలోనే ఆంధ్ర రాజకీయం రసవత్తరంగా మారింది. షర్మిల జగన్మోహన్ రెడ్డిని కలవడం, అక్కడినుండే నేరుగా ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం, ఆ మరుసటిరోజే జగన్ హైదరాబాదుకి వచ్చి కేసీఆర్‌ని పరామర్శించడం, చాన్నాళ్ల తరువాత జగన్ లోటస్‌పాండ్‌కి వెళ్లి తల్లి వై.ఎస్ విజయమ్మతో ముచ్చటించడం... ఇవన్నీ రాజకీయంగా పడుతున్న అడుగులుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. టీడీపీ + పవన్ + షర్మిల కలిసి 2024 ఎన్నికలలో 'టార్గెట్ జగన్' అన్న మిషన్‌తో పనిచేయబోతున్నారని భావిస్తున్నారు!

# కళ్యాణ వైభవం...!




రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మకూరు సీనియర్ నాయకులు గూటూరు మురళీ కన్నబాబు - విద్యుల్లతల కుమార్తె **మౌనిక - సాయి జగన్నాథ్** (హైదరాబాద్ వాస్తవ్యులు కాజ నాగ వెంకటరమేష్ బాబు - నాగపద్మినిల కుమారుడు)ల పరిణయం డిసెంబర్ 31వ తేదీ రాత్రి హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.




నెల్లూరు వాస్తవ్యులు దేగా శ్రీనివాసులురెడ్డి - రజనిల కుమార్తె **రిషిత - ప్రణయ్‌కుమార్** (హైదరాబాద్ వాస్తవ్యులు ఎం.బాలకృష్ణ - అరుణల కుమారుడు)ల వివాహం డిసెంబర్ 28వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# పింఛన్ పంపిణీ చేసిన ఆర్ఎస్ఆర్



నెల్లూరు రూరల్‌లోని 20వ డివిజన్ వైకాపా ఇన్‌ఛార్జి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక వనంతోపు, ఎరుకల పాళెం, దొమ్మరపాళెం, ఎర్ర కొనేటిమిట్ట, అరుంధతిపాళెం ప్రాంతాల్లోని లబ్దిదారులకు జగనన్న వైఎస్ఆర్ కానుకగా 3 వేల రూపాయల పింఛన్‌ను అందజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ నాలుగు విడతలుగా పింఛన్ పెంచుతూ, తాజాగా రూ.3 వేలకి పింఛన్‌ను పెంచి అవ్వాతాతల్లో సంతోషం నింపుతూ దేశంలోనే గొప్ప ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరొందుతున్నారని ఆర్ఎస్ఆర్ ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా మహిళా సెక్రెటరీ పోతురాజు రమాదేవి, గొడుసు సరళమ్మ, వేణుంబాక వాసంతి రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# 'జై భారత్' కన్వీనర్‌గా సాగర్



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్థాపించిన 'జైభారత్' పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాలకు సమన్వయకర్తలను నియమించారు. అందులో భాగంగా, నెల్లూరుజిల్లా కో-ఆర్డినేటర్‌గా గాజుల సోమశేఖర్(సాగర్) నియమితులయ్యారు. ఆమేరకు పార్టీ అధినేత లక్ష్మీనారాయణ ఈనెల 3న ఉత్తర్వులిచ్చారు.



గంగమ్మ దేవాలయం

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆదాల

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పడారుపల్లి గంగమ్మ దేవాలయం వారు ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇటీవల నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, హరిబాబుయాదవ్, మల్లు సుధాకర్‌రెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, శివయ్య, శ్రీహరి, ప్రతాప్, కార్తీక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదాలకు.. కొండూరు ఆహ్వానం



గత మూడు సంవత్సరాలుగా నెల్లూరులో అనేక సేవా, కళా, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ ట్రస్టు త్వరలో నిర్వహించనున్న వార్షికోత్సవానికి రావలసిందిగా నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆ ట్రస్టు అధ్యక్షుడు కొండూరు హరినారాయణరెడ్డి ఆహ్వానించారు. అనంతరం ఆదాలను శాలువతో సన్మానించారు. ట్రస్టు కార్యదర్శి కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఇటీవల నెల్లూరులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఇటీవల ఘనంగా జరిగింది. తొలుత నాయకులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కాంగ్రెస్ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం దివంగత మాజీప్రధాని ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీవీ శేషారెడ్డి, తలారి బాలసుధాకర్, సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నృత్య పోటీలకు అవినాష్

కొడవలూరు మండలం గండవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బి.అవినాష్ జాతీయస్థాయి నృత్యపోటీలకు ఎంపికయ్యాడు. జానపద నృత్యాల్లో జిల్లాలోనే కాక రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభతో రాణించి జనవరి 9 నుంచి 12వ తేది వరకు ఢిల్లీలో జరిగే జాతీయ కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సంపాదించాడు. ఈ సందర్భంగా అవినాష్‌ను, గైడ్ టీచర్ కట్టా సురేష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, అభినందించారు.

## దేహ సమర్పణ



నెల్లూరు భక్తవత్సలనగర్ నివాసి మద్దులూరి ఆంజనేయులు దేహ సమర్పణ చేశారు. ఆయన కుమారుడు, ప్రముఖ న్యాయవాది బ్రహ్మం సూచనతో కొద్ది నెలల క్రితమే ఆ తండ్రి దేహసమర్పణకు అంగీకరించారని, గత నెల 30న ఆంజనేయులు మరణించగా, ఆయన దేహాన్ని ఆమేరకు నారాయణ వైద్యకళాశాలకు అందజేశారని పినాకిని దేహ సమర్పకుల సంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలియజేశారు. 94 ఏండ్ల వృద్ధుడు దేహసమర్పణకు అంగీకరించడం, ఆ విషయాన్ని తండ్రికి సూచించడంలో కుమారుడు చొరవ చూపించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మృతుని నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాల నేత్ర స్వీకరణ విభాగం వారు సేకరించారని తెలిపారు. 'పినాకిని' నిర్వహణలో ఇది 34వ దేహసమర్పణ అని ఆయన పేర్కొన్నారు.


# జయభారత్ ఆసుపత్రికి స్టేట్‌బ్యాంక్ వితరణ

- అధునాతన వైద్యపరికరాలకు రూ. 54 లక్షల సాయం



స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అమరావతి సర్కిల్ వారు ఇటీవల నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్యపరికరాల కోసం 54 లక్షల రూపాయలను వితరణగా ఇచ్చారు. ఆమేరకు నమూనా చెక్కును ఆసుపత్రి నిర్వాహకులకు ఎస్‌బిఐ వారు అందజేశారు. స్థానిక సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రికి, ఒక అధునాతన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్, 2 ఐసీయు మానిటర్ల కొనుగోలు కోసం ఎస్‌బిఐ ఆ నిధిని సమకూర్చడం విశేషం. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హెల్త్ కేర్ ఇండస్ట్రీలకు, డయాగ్నొస్టిక్ సెంటర్లకు ఎస్‌బిఐ తనవంతు చేయూతనందిస్తోందని ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్ర, నెట్‌వర్క్ జీఎం సంజయ్‌కుమార్, డీజీఎం వరదరాజన్, ఎస్‌బిఐ నెల్లూరు రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజీఇఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఇఎఫ్) జిల్లా శాఖ రూపొందించిన నూతన సంవత్సరం-2024 క్యాలెండర్‌ను ఇటీవల ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆ సమాఖ్య ఛైర్మెన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవపాల్, జిల్లా ఛైర్మెన్ సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, 'హంస' రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, ఇందిరా డెంటల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలూరి శతజయంత్యుత్సవ సమావేశం



ప్రముఖ కవి పండితులు, ఆధ్యాత్మికవేత్త, 'ఆంధ్ర వాల్మీకి' బిరుదాంకితులు బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ సమావేశం నెల్లూరులో ఇటీవల జరిగింది. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక విజయమహల్ గేట్ వద్ద ఉన్న ఆంధ్రసభ గీతామందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో హనుమజ్జానకీరామశర్మ రచించిన గ్రంథాలపై ప్రముఖ సాహితీవేత్తలు వెన్నెలకంటి సుబ్బారామయ్య, వేలమూరి సోమశేఖరం తదితరులు ఉపన్యసించి సన్మానాలందుకున్నారు. ఇనమడుగు సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థస్వామి, డా.సూరం శ్రీనివాసులు, పోలవరపు లక్ష్మీనరసింహారావు, ఆలూరి శిరోమణిశర్మ, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 8న అల్లూరులో.. మాతృమూర్తి సేవా పురస్కారాలు

మండల కేంద్రమైన అల్లూరులో మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్-విశాఖపట్నం ఆధ్వర్యంలో జనవరి 8వ తేది ఉదయం 10 గంటలకు 'మాతృమూర్తి సేవా పురస్కారాలు' అందజేస్తామని ట్రస్ట్ నిర్వాహకులు మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డిలు తెలియజేశారు. అల్లూరులోని రామకృష్ణా జూనియర్ కాలేజీలోని కెఎస్ఆర్ ఫౌండేషన్ వారి క్రీడాభవనంలో జరిగే ఈ కార్యక్రమంలో పరిశినేటి కల్యాణ్ కుమార్, కందల రాజారెడ్డి, మంచికలపాటి సుధీర్‌సింగ్, చల్లా సౌజన్య, పొట్లూరు చెంచయ్యలకు మాతృమూర్తి సేవా పురస్కారాలను అందజేయనున్నారు. సభకు పురప్రముఖులు మేడా పాండురంగారెడ్డి అధ్యక్షత వహిస్తారని, సినీ, రంగస్థల నటులు 'పొలిమేర' ఫేమ్ జనార్దన్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఏ.మహేశ్వరరెడ్డి, అవధాని కోట రాజశేఖర్, పెనాక సుజాత పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కుమారి మద్దూరు సులక్షిత ప్రియధరణి, బేబీ శ్రీవైష్ణవిల జానపద నృత్యాలుంటాయని, అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు.

## టూకీగా...



### మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం రూ. 9.09 లక్షలు

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానానికి గత అక్టోబర్ నుంచి డిసెంబర్ 30వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 9,09,348 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్ తెలిపారు.

### మనుబోలులో పశువైద్యశాల తనిఖీ

మండల కేంద్రమైన మనుబోలు పశువైద్యశాలను ఇటీవల పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డా. నాగమణి తనిఖీ చేశారు. మనుబోలు, వెంకటాచలం మండలాల పశువైద్యులు, సిబ్బందిని సమావేశపరచి తగు సూచనలిచ్చారు. గ్రామాల్లోని మూగజీవాల ఆరోగ్యానికి హెల్త్‌కార్డులు పంపిణీ చేయాలని, గాలికుంటు వ్యాధికి టీకాలను వేయాలని చెప్పారు.

### రామన్నపాళెంలో గిరిజనులకు సరుకులు పంపిణీ

కొడవలూరు మండలం రామన్నపాళెం గిరిజనకాలనీలో తుఫాన్‌కు నష్టపోయిన 50 కుటుంబాలవారికి ఏఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంస్థ ప్రతినిధులు బషీర్, పావనితో పాటు వైకాపా నాయకులు శ్రీనివాసులు, సాయిమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అంకయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### ములుముడిలో వరి సాగు పరిశీలన

నెల్లూరు రూరల్ మండలంలోని ములుముడి గ్రామాన్ని ఇటీవల నెల్లూరు వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసులు సందర్శించి వరి సాగును పరిశీలించి రైతులను కలిసి వారికి అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. వ్యవసాయ అధికారి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### అంకిరెడ్డిపల్లిలో పేదలకు కొత్త దుస్తులు పంపిణీ

నూతన సంవత్సరం సందర్భంగా సీతారామపురం మండలంలోని అంకిరెడ్డిపల్లిలో ఉన్న గ్రేస్ ఇవాంజెలికల్ మినిస్ట్రీస్ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు కొత్త దుస్తులు పంపిణీ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ అధ్యక్షులు నేలటూరి జాషువా ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది

### మర్రిపాడు హాస్టల్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు

మర్రిపాడులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు జనసేన మర్రిపాడు మండలశాఖ అధ్యక్షురాలు ఓరుగంటి ప్రమీల, ఆ పార్టీకి చెందిన గుర్రాల వినయ్‌కుమార్ సహకారంతో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీచేశారు. న్యూఇయర్ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల నాయకుడు చిన్నా, శ్యామ్, హరికృష్ణ, కల్యాణ్, రమేష్, నిఖిల్ పాల్గొన్నారు.

### విడవలూరు చర్చిలో న్యూఇయర్ వేడుకలు

విడవలూరు దళితవాడలోని బాప్టిస్టు చర్చిలో జనవరి 1న నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులతో కలసి పాస్టర్ లోకరాజు కేకును కట్‌చేసి అందరికీ పంచి శుభాకాంక్షలు చెప్పారు. ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలైన బాలలకు బహుమతులు అందజేశారు.

### కొత్తూరులో వీరాంజనేయస్వామికి గ్రామోత్సవం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని శ్రీ వీరాంజనేయస్వామికి జనవరి 1న అత్యంత వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత, అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని శోభాయమానంగా అలంకరించారు. ఆల్తూరు శేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### చెంచులక్ష్మీపురంలో అయోధ్యరాముని అక్షింతలు

బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో జనవరి 1వ తేదీన అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. తొలుత అక్షింతలకు పూజలు చేశారు. జనసంపర్క్ అభియాన్ ప్రముఖ్ కడియాల వెంకయ్య ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ అక్షింతలు పంచారు. బోగోలు ఉపసర్పంచ్ మునగాల జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల కోసం అనేక సంస్కరణలు

## కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాల

దేశంలోని మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా భారత ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తమ్ రూపాల చెప్పారు. సాగర్ పరిక్రమ పర్యటనలో భాగంగా జనవరి 1న ఆయన చైన్నై నుండి జలమార్గం ద్వారా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఆయన సతీమణ సబితాబెన్ రూపాలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా మత్స్యకారులు లబ్ధి పొందుతున్నట్లు చెప్పారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 30శాతం మత్స్య సంపద ఉత్పత్తి అవుతుందని, ఇది దేశంలోనే అత్యధికమన్నారు. దేశంలోనే మత్స్య సంపద ఉత్పత్తిలో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మత్స్యకారులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టామని, బ్యాంకులు కూడా విరివిగా మత్స్యకారులకు రుణాలు అందించాలని ఆయన సూచించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను త్వరగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపదన యోజన పథకం ద్వారా రూ.20 వేల కోట్లతో మత్సరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆక్వా రైతులకు కూడా అన్ని విధాల మేలు జరిగేలా సిఏ చట్టంలో సవరణ చేసిన ఘనత ప్రధాని మోడీకే దక్కిందన్నారు. కేంద్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నీతూకుమారి, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, జేడీ నాగేశ్వరరావు, ఆప్కాప్ చైర్మెన్ అనిల్‌బాబు, జేసీ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతే.. ప్రభుత్వ ధ్యేయం

## ■ రూ. 3.15 కోట్లతో.. బుచ్చిలో సామాజిక ఆరోగ్య కేంద్రం

### ప్రారంభించిన కలెక్టర్, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు నియోజకవర్గంలోని బుచ్చి రెడ్డిపాళెంలో రూ. 3.15 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రానికి జనవరి3న జిల్లా కలెక్టర్ హరినారాయణన్, కోవూరు ఎమ్మెల్యే నల్లప రెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం, వారు ఆరోగ్యంగా ఉండడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని, విద్య, వైద్యం పేదలకు చేరు వైతే, ఆర్థికంగా పేదల స్థితిగతులు మెరుగై సమాజం కూడా అభివృద్ధి పథంలో పయ నిస్తుందని అన్నారు. ఆ లక్ష్యంతోనే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసు కొచ్చిందన్నారు.

### పేదలకు అత్యాధునిక వైద్యసేవలు

పేదలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలోని అసం పూర్తిగా ఉన్న ఓ భవనం నిర్మాణం చేపట్ట డానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీని వాసులురెడ్డి ఎంపీల్యాడ్స్ నిధులు రూ.10 లక్షలను మంజూరు చేశారని, అదేవిధంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు సిఎస్ఆర్ నిధుల నుంచి రూ. 25 లక్షలు విడుదల చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ వీరి చలపతి, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఏపీఎంఐడిసి ఇఇ సుధాకర్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ యువజన విభాగం నాయకులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైకాపా రూరల్, పట్టణ కన్వీనర్లు సతీష్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మెడికల్ ఆఫీసర్ పద్మజ, పలువురు వైకాపా ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### వేగవంతంగా పీహెచ్‌సీల ఆధునీకరణ :

కోవూరు నియోజకవర్గంలోని జొన్నవాడ, ఇనమడుగు, యల్లాయపాళెం, విడవలూరు, రామతీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధునీకరణ పనులను 2.9 కోట్ల రూపాయల వ్యయంతో త్వరలోనే చేపట్టనున్నామని ఎమ్మెల్యే ప్రసన్న ఈ సందర్భంగా చెప్పారు. మైపాడులో రూ. 1.54 కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. విడవలూరులో రూ. 50 లక్షలతో 'న్యూ పబ్లిక్ హెల్త్‌యూనిట్ బ్లాక్' నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.





13వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు
(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2024 నాటికి
13 సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ - భార్య

కుమారులు - కోడళ్ళు
డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి
ఎన్.వినోద్‌రెడ్డి - షాలిని

కుమార్తెలు - అల్లుళ్ళు
జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి
ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి

మనుమలు, మనుమరాండ్రు
జి.అభిషేక్‌రెడ్డి, వైష్ణవి
జి.అనుదీప్, భావిక, రాహిల్, రుషిల్ సాకేత్,
విషాల్, మేఘన, హర్ష, సంజన, వినూష

మునిమనుమరాలు - అమైర, ఆరియ

CRM IT Customer Success Partner | Fortune Summit business park NR Towers, BANGALORE.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com